ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.8	28.2
కావలి	37.0	26.0
కందుకూరు	37.0	26.0
ఆత్మకూరు	38.0	27.0
ఉదయగిరి	39.0	24.0

కిలో పొగాకు రూ.241

కలిగిరి : పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 658 పొగాకు బేళ్లు తీసుకువచ్చారు. మొత్తం 11 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 580 బేళ్లు కొనుగోలుచేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.241, కనిష్ఠ ధర రూ. 220, సగటు ధర రూ. 227.63గా నమోదయ్యింది.

మిర్చి ధర ఢమాల్!

మూణ్నెళ్ల క్రితం క్వింటం రూ.23వేలు.. ఇప్పుడు 15వేలే!



లింగసముద్రం, ఏప్రిల్ 13 : ఎర్ర బంగారంగా పలవబడే మిర్చి ధర పడిపోతోంది. మూడు నెలల క్రితం వరకు క్వింటం ధర రూ.23 వేల వరకు ఉండగా, ప్రస్తుతం రూ.15 వేలకు పడిపోయింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఒక ఎకరాలో మిర్చి దిగుబడి 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు బాగానే ఉండగా తొలి కోతల సమయంలో ఉన్న మద్దతు ధర కొన్ని నెలల పాటు ఉంటుందని, లాభాలు వస్తాయని రైతు లు ఆశపడ్డారు. అయితే, ధర పతనావస్థకు చేరుకుంటుండటంతో వారిలో దిగులు మొద లైంది. మన రాష్ట్ర రైతులేగాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రాల నుంచి రైతులు మిర్చి టిక్కీలు గుంటూరు మిర్చి యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. అయితే, ఇక్కడ నుం చి చైనాకు ఎగుమతు లు ఆగిపోవడంతో విక్రయాలు సక్రమంగా జరగడంలేదని రైతులు వాపోతున్నారు. శీతల గోదాముల్లోను మిర్చి టిక్కీలను భారీస్థాయిలో నిల్వ చేశారని చెబుతున్నారు. మండల రైతులు గుంటూరుకు తీసుకెళ్లినా అక్రడ అమ్మకాలు లేక, నిల్వ చేసేందుకు గోదాముల్లో చోటు ఉండటం లేదు. దీంతో మిర్చి ఉత్పత్తులను రోడ్లపైనే పట్టలు కప్పి కాపాడుకుంటు న్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే పాడైపోతుందన్న ఉద్దేశంతో అందిన కాడికి అమ్మేస్తున్నారు.

ఆత్మకూరు ఎమ్మెల్యేపై కేసు నమోదు

ఆత్మకూరు, ఏప్రిల్ 13 : ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిపై పోలీసు కేసు నమోదయ్యింది. ఈ నెల 11వ తేదీన రంజాన్ సందర్భంగా ఆత్మకూరులోని ఓ మసీదులో జరిగిన ప్రార్థనలో ముస్లింలతోపాటు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచారం నిర్వహించి, పలు రకాల హామీలు గుప్పించారు. దీన్ని ఆధారాలతో సహా ఏబీఎన్ చానల్‌లో ప్రసారం అయ్యింది. ఈ కథనంతో స్పందించిన ఎన్నికల అధికారులు విచారణ చేయగా నిర్ధారణ అయ్యింది. దీంతో శనివారం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిపై ఆత్మకూరు పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

• కారులో రూ.17లక్షల నగదు స్వాధీనం

నెల్లూరు (క్రైం) : నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద కారులో తరలిస్తున్న రూ.17 లక్షల నగదును శనివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో దర్గామిట్ట పోలీసులు అన్నమయ్య సర్కిల్ వద్ద తనిఖీలు చేస్తుండగా చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని ఓ జిమ్ మేనేజర్ వెంకటేశ్వర్లు కారును ఆపారు. కారులో 17 లక్షల నగదు ఉన్నట్టు గుర్తించారు. నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.



జలదంకిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ తల్లి మస్తానమ్మ



కందుకూరులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య



ఆత్మకూరు : తన తండ్రిని గెలిపించాలంటూ మహిళను అభ్యర్థిస్తున్న కైవల్యారెడ్డి



వెంకటాచలం : తన తండ్రి సోమిరెడ్డి గెలుపు కోసం కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేసిన డాక్టర్ సింధురెడ్డి



బుచ్చిరెడ్డిపాళెంలో టీడీపీ అభ్యర్థి ప్రశాంతి రెడ్డి తరపున ప్రచారంలో పాల్గొన్న కుమార్తె నీలిమారెడ్డి, కోడలు దివ్యారెడ్డి

జనంలోకి బంధుగణం

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల కుటుంబ సభ్యులు • పోటీపోటీగా పర్యటనలు.. ప్రజలతో పలకరింపులు

నెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : 1970 సంవత్సరానికి ముందు ఎన్నికల బరిలో నిలిచిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటు కోసం ఇల్లిల్లు తిరిగేవారే కారు. అప్పట్లో గోడలపై ముద్రించే పార్టీ గుర్తులే అభ్యర్థు లుగా చెలామణి అయ్యేవి. 1983 తరువాత సీఎం అభ్యర్థులే ప్రధాన ప్రచార ఆకర్షణలుగా మారారు. ఎన్టీఆర్, చంద్రబాబు ఇలా ప్రధాన పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థుల పోస్టర్లు, కటౌట్లే ప్రచారంలో కీలక పాత్ర పోషించేవి. 2009 తరువాత ఎన్నికల ప్రచారంలో ట్రెండ్ మారింది. అవినీతి, అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత జగన్ జైలుకు వెళ్లడంతో ఉప ఎన్నికల్లో ఆయన తరఫున తల్లి విజ యమ్మ, చెల్లెలు షర్మిల ఎన్నికల ప్రచారం చేశారు. ఇలా అభ్యర్థుల గెలుపు కోసం కుటుంబ సభ్యుల ప్రచారాలు తరువాతి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. భర్తల కోసం భార్యలు, తండ్రుల కోసం బిడ్డలు, వారి పతి, సతులు ఇలా కుటుంబ సమేతంగా ఎన్నికల ప్రచా రంలో పాల్గొంటున్నారు. అభ్యర్థులకు దీటుగా వీరు సైతం చెమటోడ్చుతు న్నారు. ఓట్ల అభ్యర్థనలో ప్రజలను ప్రభావితం చేసే స్థాయిలో మాట్లాడుతున్నారు. నెల్లూరు జిల్లాలో నాలుగు నెలల క్రితం నుంచే అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యుల ప్రచారం మొదలయ్యింది.

• టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ విజయం కోసం నాలుగు నెలలుగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఆయన సతీమణి పొంగూరు రమాదేవి ప్రచారం చేస్తున్నారు. ఆరంభంలో నారాయణ రాష్ట్ర పార్టీ కార్యకలా పాలు, వ్యాపార పనుల నిమిత్తం ఒకటి రెండు రోజులు ప్రచారానికి దూరంగా ఉన్నా ఆ లోటు తెలియకుండా ఈమె ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈమెతోపాటు నారాయణ ఇద్దరు కుమార్తెలూ ప్రజలను కలుస్తున్నారు. పెద్ద కుమార్తె సింధుజా, రెండవ కుమార్తె షరిణిలు నగర పరిధిలోని డివిజన్లలో కలియ తిరుగుతూ తండ్రిని గెలిపించమని అభ్యర్థిస్తున్నారు.

• నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన కుటుంబమంతా జనంలోకి కదిలింది. ఆయన సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ, కుమార్తెలు లక్ష్మీహైందవి, సాయి వైష్ణవి, చిన్న అల్లుడు నవీన్ గడిచిన 125 రోజులుగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మొదటి విడత ఇంటింటి ప్రచారాన్ని పూర్తి చేసుకొని రెండో విడ త ప్రచారం ప్రారంభించారు. తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నకు సర్వం తానై ఎన్నికల వ్యూహరచన చేస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి కోసం ఆయన కుమార్తె హిమబిందు కూడా ప్రజలను కలుస్తున్నారు.

• నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల గెలుపు కోసం కుటుంబ సభ్యులంతా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రశాంతిరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి, కుమార్తె నీలిమారెడ్డి, అల్లుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కోడలు ఐషితరెడ్డి కోవూరు నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు. ఇక ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయి భార్య సుజిత రెడ్డి, కుమార్తె నేహారెడ్డిలు కూడా ప్రచారం చేస్తున్నారు.

• సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు కోసం ఆయన కోడలు శృతిరెడ్డి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రతినిత్యం ఈమె పల్లెల్లో తిరుగుతూ తన మామయ్యను గెలిపించమని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. సోమిరెడ్డి కుమారుడు రాజగోపాల్‌రెడ్డి ప్రచారంతోపాటు ఎన్నికల నిర్వహణ బాధ్యతలను చూస్తు న్నారు. వైసీపీ అభ్యర్థి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితరెడ్డి తండ్రి గెలుపు కోసం ప్రజలను కలుస్తున్నారు.

• కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం ఆయన సతీమణి ఇంటూరి సౌజన్య గడప గడపకు తిరిగి ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి గెలుపు కోసం బుర్రా మధుసూదన్ యాదవ్ సతీమణి లక్ష్మీ, కుమారుడు లక్ష్మీనారాయణలు కూడా ప్రచారం చేస్తున్నారు

• ఆత్మకూరులో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపు కోసం ఆయన కుమార్తె కైవల్యారెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గం పూర్తిగా కలియ తిరుగుతున్నారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు.

• కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గెలుపు కోసం ఆయన కుమార్తె సంహితరెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తరపున ఆయన భార్య ఆదిలక్ష్మీ ఎన్నికల బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు.



నెల్లూరు నగరంలో తన భర్త నారాయణ గెలుపు కోసం రమాదేవి ప్రచారం



కొడవలూరు : కోవూరు టీడీపీ అభ్యర్థి ప్రశాంతి రెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న ఆమె తనయుడు అర్జున్ రెడ్డి



ఇంటింటి ప్రచారం వంద రోజులైన సందర్భంగా దొంతాలిలో కేక్ కట్ చేస్తున్న నెల్లూరు రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు (ఫైల్)



కావలి : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుమాటి క్రిష్ణారెడ్డి కుమార్తె సంహితా రెడ్డి ప్రచారం



నెల్లూరు రూరల్ : వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి కుమార్తె బిందు రెడ్డి ప్రచారం



ఆత్మకూరు : తన కుమారుడు విక్రమ్‌రెడ్డి తరపున ప్రచారం చేస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

సామాన్యుడికి లక్కు! అధికారానికే కిక్కు!

- మద్యం దుకాణాల్లో దొరకని సరుకు
- నిర్ణీత సమయానికన్నా ముందే మూత
- వైసీపీ నేతల డంప్‌నకు చేరుతున్న మందు
- ఇదే అదునుగా విచ్చలవిడిగా బెల్టు వ్యాపారం
- మందుబాబులకు తప్పని కష్టాలు

'గతేడాది ఇదే సీజనులో ఎంత మద్యం విక్రయాలు జరిగాయో. ఆ లెక్కనే ఇప్పుడూ అమ్మకాలు ఉండాలి. అంతకు మించి మద్యం విక్రయాలు చేయొద్దు.' ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవి. ఇది బాగానే ఉన్నా.. అధికార పార్టీ నేతలకు మాత్రం ఈ ఆదేశాలు కలిసొచ్చినట్టున్నాయి. ఎక్సైజ్ శాఖలో కొంత మంది అధికారులు, మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది సహకారంతో కేసుల కొద్దీ మద్యం సీసాలు రహస్య ప్రదేశాలకు తరలిపోతున్నాయి. సందట్లో సడేమియా అన్నట్టుగా ఎమ్మార్పీకంటే అదనపు ధరకు బెల్టు దుకాణాలకూ ఇచ్చేస్తున్నారు. దుకాణం తెరవక ముందే వాటిని స్కాన్ చేసి గట్టుచప్పుడు కాకుండా తరలించేస్తున్నారు. మధ్యాహ్నానికే 'నో స్టాక్' బోర్డు పెట్టేసి దుకాణాలను మూసేస్తున్నారు. మద్యంపై ఆశచావని మందుప్రియులు బార్‌లకు వెళ్లడమే లేదా బెల్టుషాపులకు ఆశ్రయిస్తున్నారు.

మర్రిపాడులో మూతపడిన మద్యం దుకాణం



నెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 193 మద్యం దుకాణాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు, పట్టణాల్లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ దుకాణాలు పని చేయాల్సి ఉంది. అయితే గడిచిన నెల రోజులుగా సాయంత్రం ఆరేడు గంటలకే ఈ దుకాణాలను మూసివేస్తున్నారు. ఎందుకిలా అని అడిగితే దుకాణంలో సరుకు అయిపోయిందని సిబ్బంది చెబుతున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు వరకు అయిపోని సరుకు ఇప్పుడే ఎందుకు అయిపోతోందన్నదే అసలు ప్రశ్న. జిల్లాలో సరాసరి రోజుకు రూ.3 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. అంతకుమించి ఎన్నికల సమయంలో విక్రయాలు జరపవద్దని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు చెబుతున్నారు. మరి ఆ మేరకైనా సరుకు విక్రయాలు దుకాణాల్లో జరుగుతున్నాయా.. అంటే అదీ లేదు. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని తెప్పించిన వైసీపీ నేతలు ఈ దఫా ప్రభుత్వ మద్యం దుకాణాలను టార్గెట్ చేసుకుంటున్నారు. మద్యం దుకాణాల్లోని సిబ్బంది అంతా వైసీపీ నాయకులు నియమించిన వారే కావడం, వారికి ఎక్సైజ్ సిబ్బంది కూడా సహకరించడంతో దర్జాగా మద్యాన్ని డంప్‌కు తీసుకెళుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఆలోచనలో ఉన్న వైసీపీ నేతలు ఆ క్రమంలో ఎక్కడికక్కడ భారీగా మద్యాన్ని నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోంది. దుకాణం తెరిచేముందుగానే మద్యం దుకాణాల్లోని సిబ్బంది వైసీపీ నేతలకు ఇచ్చే బాటిళ్లను స్కాన్ చేసేస్తున్నారు. చీకటి పడగానే ఆ కేసులను దుకాణాల నుంచి తరలించేస్తున్నారు. ఈ విషయాలు సెబ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నెల రోజుల క్రితం వరకు రాత్రి 9 గంటల వరకు సరుకు విక్రయాలు జరిగినా నిండుకోని మద్యం నిల్వలు ఇప్పుడు సగం పూటకే అయిపోతున్నా ఏ అధికారి కూడా దృష్టి పెట్టకపోవడం గమనార్హం. ఇదే సమయంలో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మద్యం దుకాణాల నుంచి భారీగానే బెల్టుకు మద్యం తరలిపోతోంది. రాత్రి ఏడు గంటలకు మద్యం దుకాణంలో సరుకు అయిపోయినా పక్కనే ఉన్న బెల్టుషాపుల్లో మాత్రం దొరుకుతోంది. అయితే మద్యం దుకాణానికి, బెల్టు షాపుకు మధ్య క్వార్టర్‌కు రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఎక్కువగా ఉంటోంది. వైసీపీ నేతల మందు రాజకీయం ఇప్పుడు మందుబాబులపై భారం.

ఉదయగిరిలో మధ్యాహ్నానికే బంద్!



మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ విధించిన పరిమితిని కూడా అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. రోజువారి టార్గెట్ పూర్తయిందని చెబుతూ ఉదయగిరి నియోజకవర్గంలో చాలా చోట్ల మధ్యాహ్నానికే దుకాణాలు మూసేస్తున్నారు. ఆ తరువాత మందుబాబులు బ్లాక్‌లో కొని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. కొందరు ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో నిఘా లేకపోవడంతో అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి మద్యం వెళ్లిపోతోంది. మద్యం దుకాణాల నుంచి 70 శాతానికిపైగా బెల్టుషాపులకు తరలిస్తున్నారు.

- ఉదయగిరి



లింగసముద్రం : శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మూతపడిన ప్రభుత్వ మద్యం దుకాణం

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుకంజ

- ఫస్ట్ ఇయర్‌లో 61 మందికి గాను 9 మందే ఉత్తీర్ణత
- వైసీపీ ప్రభుత్వ పనితీరును వెక్కిరిస్తున్న ఫలితాలు


పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

పొదలకూరు, ఏప్రిల్ 13: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో వెనుకంజలో ఉంది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 61 మంది విద్యార్థులకు గాను కేవలం 9 మంది ఉత్తీర్ణులయ్యారు. 15 శాతం మాత్రమే ఉత్తీర్ణత ఉంది. అలాగే ద్వితీయ సంవత్సరంలోనూ 56 మంది విద్యార్థులకు గాను 28 మంది ఉత్తీర్ణులయ్యారు. సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని అటకెక్కించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించి అమలు చేయగా, వైసీపీ తన ఐదేళ్ల పాలనలో ఆ విధానానికి మంగళం పాడింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిని పెంచుతాం.. మండలానికో జూనియర్ కళాశాలతో పాటు ప్రత్యేకంగా బాలికల జూనియర్ కళాశాలలను ఏర్పాటుచేస్తాం అని సీఎం జగన్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం కేవలం మాటలకే పరిమితమైందని ఇంటర్ ఫలితాలు తేల్చి చెబుతున్నాయి. మొత్తంగా ఇంటర్ ఫలితాలు ప్రభుత్వ పనితీరును వెక్కిరిస్తున్నాయి.

హైస్కూల్ ప్లస్ ఫలితాల్లో నిరాశ!

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 13 : కూర్చునేందుకు తగినన్ని గదుల్లేవు.. బోధకుల నియామకం చేపట్టలేదు. పాఠ్యపుస్తకాలు అందించలేదు.. ప్రయోగశాల ఏర్పాటుకు ఆలోచనే లేదు.. అయినా విద్యార్థుల ప్రవేశాలను మాత్రం హడావుడి చేసి చేర్పించారు. జిల్లాలో ప్రత్యేకంగా బాలికల కోసం ఇంటర్మీడియట్ కోర్స్ ప్రవేశపెడుతూ ఉన్నతీకరించిన 13 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో వెనుకబడ్డారు. ప్రభుత్వం వీరి జీవితాలతో చెలగాటమాడుతోందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతోన్నాయి. బాలికా విద్యను ప్రోత్సహించాలన్న ఆలోచన మంచిదే కానీ సన్నద్ధతే అస్తవ్యస్తంగా మారింది. పాఠ్యపుస్తకాలు లేకుండా, అధ్యాపకులను నియమించకుండా ఏడాదంతా అతికష్టంగానే పూర్తి చేశారు. కీలకమైన ఇంటర్ విద్యపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ఈ ఏడాది విద్యార్థినులు ఏమి చదివామో తెలియకుండానే వార్షిక పరీక్షలకు హాజరై ఆశించిన స్థాయిలో ఉత్తీర్ణత సాధించలేక పోయారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. బాలికల విద్యాభివృద్ధికి ఉన్నత పాఠశాలల్లోనే జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లాలో పదో తరగతిలో ఎక్కువ మంది బాలికలున్న అల్లూరు, ఆత్మకూరు, బోగోలు, ఇందుకూరుపేట, జలదంకి, కలువాయి, కొడవలూరు, మనుబోలు, ముత్తుకూరు, నెల్లూరు, సంగం, ఉదయగిరి, విడవలూరు లలోని ఉన్నత పాఠశాలల్లో బాలికల జూనియర్ కళాశాలలను హడావుడిగా ఏర్పాటు చేశారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో కనీసం రెండింటిని ఎంపిక చేసుకుని ప్రవేశాలు చేపట్టారు. ఈ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 91, బైపీసీలో 40, సీఈసీలో 75 మంది అడ్మిషన్లు పొందారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 28, బైపీసీలో 25, సీఈసీలో 8 మంది చేరారు. మొత్తం మీద ప్రథమ సంవత్సరంలో 206, ద్వితీయ సంవత్సరంలో 61 మందితో మొత్తం 267 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. వీరిలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ లో 91 మంది పరీక్షకు హాజరు కాగా 43 మంది, బైపీసీలో 40 మంది హాజరు కాగా 19 మంది, సీఈసీలో 67 మంది హాజరు కాగా 27 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 28 మంది హాజరు కాగా 20 మంది, బైపీసీ లో 25 మంది కి 20 మంది, సీఈసీలో 8 మందికి ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

అధ్యాపకులు.. బోధన లేకుండానే..

ఉన్నత పాఠశాలలు జూనియర్ కళాశాలలుగా మార్పు చేసినా ఒక్క కళాశాలలో కూడా అధ్యాపకుల నియామకం చేపట్టలేదు. ఆన్‌లైన్‌లో ప్రవేశాలు చేపట్టడంతో ఆలస్యంగా విద్యా సంవత్సరం ప్రారంభించారు. డాక్టర్, ఇంజనీర్, శాస్త్రవేత్త ఇలా ఏది కావాలన్నా ఇంటర్ విద్యే ప్రధానం. పోటీతత్వంతో ఉండే ఈ దశను ప్రభుత్వం అధ్యాపకులు, పుస్తకాలు, వసతులు లేకుండానే ఏడాదంతా గడిచిపోవడంతో వార్షిక పరీక్షలు ఎలా రాయాలో తెలియకనే విద్యార్థినులు ఆందోళనతోనే పరీక్షలకు హాజరయ్యారు. హైస్కూళ్లలో టీచర్లుగా పనిచేస్తూ పీజీలు పూర్తి చేసిన ఉపాధ్యాయులు కొంతమందిని బోధనకు నియమించినా మొక్కుబడిగానే తరగతుల నిర్వహణ జరిగినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. కనీసం పాఠ్య పుస్తకాలు కూడా అందించక పోవడంతో తెలిసిన వారి దగ్గరో, సీనియర్స్ వద్ద ఉన్న పాత పాఠ్యపుస్తకాలను తెచ్చుకుని చదువుకున్నారని అంటున్నారు. అత్యధిక కళాశాలలో బోధనలు కూడా జరగలేదని తెలుస్తోంది. కీలకమైన దశలో ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ కళాశాలపై దృష్టి సారించి ఇలాంటి ఫలితాలు పునరావృతం కాకుండా ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ముసునూరు ఇందిరమ్మ కాలనీలో కర్రల ఆధారంగా లాగిన తీగలు

కావలి కాలనీల్లో సౌకర్యాలు శూన్యం

- సమస్యలతో ప్రజల సహజీవనం

కావలిటౌన్, ఏప్రిల్13: ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు కాలనీల్లో సౌకర్యాలు పేద ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీ, కావేరిగుంట కాలనీ, కొనదిన్నె కాలనీ, ముసునూరు ఇందిరమ్మ కాలనీ, బుడంగుంట ఇందిరమ్మ కాలనీల్లో దాదాపు 10వేలకు పైగా గృహాలు ఉన్నాయి. ఇందులో 40వేల మంది నివసిస్తున్నారు. ఈకాలనీలు ఏర్పడి దాదాపు 20ఏళ్లు కావస్తున్నా, ఇప్పటికీ మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక పట్టణానికి దూరంగా కాలనీలు ఉండడంతో అంతర్గత, కనెక్టివిటీ రోడ్లు లేక గుంతలతో కూడిన మట్టి రోడ్లలో రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు పడినప్పుడు కాలు కిందపెట్టలేక బురదలో నడవక తప్పని పరిస్థితి. డ్రైనేజీలు కాలువలు లేక ఇళ్ల మధ్యే మురుగు నిల్వ చేరింది. ఆ మురుగు గుంటల్లో పందులు పొర్లాడుతూ రోగాలకు కారణమవుతున్నాయి. తాగునీటి సౌకర్యం లేక వాటర్ క్యాన్లను కొనుగోలు చేసుకుంటున్నారు.


ఇందిరానగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రోడ్డుపై మురుగు.. అరికట్టేదెవరు ?

కావలి వెంగళరావునగర్ పరిధి ఇందిరానగర్ కాలనీ దిగువప్రాంతంలో సీసీ రోడ్డుపై మురుగునీరు పారుతోంది. దీనికితోడు చెత్తాచెదారం కూడా రోడ్డుపైకి చేరింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడతున్నారు. డ్రైనేజీ కాలువలు అధ్వానంగా ఉండటంతో మురుగునీరు రోడ్డుపై పారుతున్నాయి. మురుగునీటి పారుదలకు మున్సిపల్ అధికారులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

\- కావలి

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా : తప్పిన ప్రమాదం


బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ల లారీ

మనుబోలు, ఏప్రిల్ 13: మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా పడింది. నెల్లూరు నుంచి గూడూరు వెళుతున్న గ్యాస్ సిలిండర్ల లారీ బారికేడ్లను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీలోంచి రెండు, మూడు సిలిండర్లు రోడ్డుపై పడి పోయాయి. అయితే గ్యాస్ లీక్ కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటన వలన ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు పునరుద్ధరించారు.

రైలు పట్టాలపై మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, ఏప్రిల్13: పట్టణంలోని వైకుంఠపురం సమీపంలో గల రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి(30) మృతదేహాన్ని శనివారం తెల్లవారు జామున కీమన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చాడు. కలుగోళమ్మ గుడి సమీపంలో దిగువ మార్గంలోని రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని ఎస్ఐ అరుణకుమారి పరిశీలించారు. ఆ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదన్నారు. బ్లూ, వైట్ కలర్ గీతల ఫుల్ హ్యాండ్ చొక్కా, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు

సంగం, ఏప్రిల్ 13: ఆత్మకూరుకు చెందిన బన్ని, నాయబ్‌లు అనే యువకులు శనివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంలో నెల్లూరు నుంచి ఆత్మకూరుకు బయలుదేరారు. సిద్దీపురం సమీపంలోకి వెళుతుండగా వేగం అదుపు తప్పడంతో ద్విచక్ర వాహన రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బన్నీకి తీవ్రగాయాలవగా.. నాయబ్ స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న 108సిబ్బంది వీరిని నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ శాఖ వాట్సాప్‌ను వినియోగించుకోండి

- ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 13: విద్యుత్ శాఖ అందిస్తున్న సేవలను తెలుసుకోవడంతో పాటు, విద్యుత్ సమస్యలను తెలియజేసేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ నెంబర్ ఏర్పాటు చేశామని, దీనిని వినియోగదారులు వినియోగించుకోవాలని ఆ శాఖ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9133331912 నెంబర్‌ను ప్రతి ఒక్కరూ మొబైల్‌లో ఫీడ్ చేసుకోవాలని కోరారు. దీనిని ఉపయోగించగానే 13 అంకెల సర్వీసు నెంబర్ వస్తుందని, దానిని నమోదు చేయగానే విద్యుత్ శాఖ అందించే వివిధ రకాల సేవలు అందులో వస్తాయని తెలిపారు. అలాగే విద్యుత్ సర్వీసు కోసం దీని ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంతేగాకుండా విద్యుత్ బిల్లును చూసుకోవడం, చెల్లించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేకంగా ఆప్షన్ ఉంటుందని తెలిపారు. అన్ని సౌకర్యాలు దీనిద్వారా కలుగుతున్నందున ప్రతి ఒక్కరూ వాట్సాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

పోలీసుల తనిఖీలో నగదు స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణా అరికట్టేందుకు జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో శని వారం పోలీసులు చేపట్టిన తనిఖీలో పట్టుబడ్డ నగదు, మద్యం, పేకాట స్థావరాలపై దాడుల వివరాలను పోలీసు కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో తగిన రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.5 లక్షలు, వేదాయపాలెం పరిధిలో రూ.5 లక్షలు, మనుబోలు స్టేషన్ పరిధిలో రూ.1,13, 800, ముత్తుకూరు స్టేషన్ పరిధిలో రూ.52 వేలు, కృష్ణపట్నం పోర్ట్ పరిధిలో రూ.1.04 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించిన పోలీసులు అల్లూరు పరిధిలో ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.1700 స్వాధీనం చేసుకున్నారు. కావలి రూరల్ పరిధిలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ.1870 స్వాధీనం చేసుకున్నారు. మర్రిపాడు పరిధిలో 10, వీకే పాడు పరిధిలో 20, ముత్తుకూరులో 10, కావలి రూరల్‌లో 19, ఉలవపాడులో 28 మద్యం సీసాలను పోలీసులు సీజ్ చేయగా, సెబ్ పోలీసులు 91 మద్యం సీసాలను సీజ్ చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6846
వెండి కిలో ధర	రూ. 85,400
వెండి ఒక గ్రాము	రూ. 87.40

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ తనిఖీ

ఇందుకూరుపేట, ఏప్రిల్ 13 : ఇందుకూరుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి పి దయాసాగర్ శనివారం తనిఖీచేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాబు శ్రీధర్, సీఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ : కలెక్టర్


రుద్రకోట వద్ద స్టాటికల్ సర్వేలెన్స్ చెక్‌పోస్ట్ తనిఖీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

కావలి, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 8 నియోజకవర్గాలకు అవసరమైన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ చేశామని జిల్లా ఎన్నికల అధికారి ఎం. హరి నారాయణన్ తెలిపారు. పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కావలి, కందుకూరు నియోజకవర్గాల పీవోలు, ఏపీవోలకు జరుగుతున్న శిక్షణను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ర్యాండమైజేషన్ చేసిన ఈవీఎంలను ఆర్వోలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.పీవోలు, ఏపీవోలకు మరోవిడత శిక్షణ ఈనెల 15 నుంచి ఇస్తామన్నారు. అనంతరం కావలి రూరల్ మండలం రుద్రకోట వద్ద స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్ చెక్‌పోస్టును కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కావలి ఆర్డీవో శీనా నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 13 : మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్డీవో కార్యలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎంల గోదాములను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేది నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 29వ తేది ఎన్నికల్లో నిలిచే అభ్యర్థుల జాబితాలు ప్రకటిస్తామన్నారు. జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు అవసరమైన ఈవీఎంలను సిద్ధం చేశామన్నారు. వాటిని నియోజకవర్గ స్థాయి అధికారులకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పలువురు జిల్లా అధికారులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

- కలెక్టరేట్ ఏవోకు యూనియన్ నేతల వినతి


ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

నెల్లూరు (వైద్యం) : మున్సిపల్ కార్మికులకు మార్చి నెల వేతనంతో పాటు హెల్త్ అలవెన్స్‌లు తక్షణం చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నరసయ్య మాట్లాడుతూ నెల్లూరు మున్సిపల్ కార్మికులకు మార్చి నెల వేతనం, ఆత్మకూరు, కావలి మున్సిపాలిటీలలో రెండు నెలల నుంచి వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి ప్రోత్సాహకాలకు మంగళం పాడారన్నారు. కావలి మున్సిపాలిటీలో దినసరి కూలీలకు సైతం మూడు నెలల నుంచి కూలీలు చెల్లించలేదని తెలిపారు. దళిత, గిరిజన కుటుంబాలకు చెందిన కార్మికులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వేతన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ, నెల్లూరు నగర, రూరల్ కార్యదర్శులు ఆశోక్, కొండయ్య, నాయకులు భాగ్యమ్మ, లోకేష్, శ్రీను, రవీంద్ర, సలోమి తదితరులు పాల్గొన్నారు.

మా గెలుపునకు సహకరించండి!

- హైదరాబాదులో వలసవాసులతో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి



ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం సహకరించాలని నెల్లూరు ఎంపీ ఎన్డీఏ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కోరారు. శనివారం రాత్రి హైదరాబాదులోని మియాపూర్ నరైన్ గార్డెన్స్‌లో ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల నుంచి వలస వెళ్లిన వారితో ఉదయగిరి, కందుకూరు అసెంబ్లీ అభ్యర్థులు కాకర్ల సురేష్, ఇంటూరు నాగేశ్వరరావులతో కలిసి వేమిరెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వలసవాసులంతా గ్రామాలకు వచ్చి తమకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వలసవాసులు తమకు సహకరిస్తే మెట్ట ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి వలసల నివారణకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును చేసుకోవాలన్నారు. వలసవాసులు మంచి మనుసుతో ఆలోచించి తమ గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా అభ్యర్థులను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

కావలి రూరల్, ఏప్రిల్ 13: పట్టణంలోని అష్టలక్ష్మీనగర్‌లో అత్తింటి వేధింపులు తాళలేక అంబార్కర్ లక్ష్మి(32) శనివారం ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు, వెంగళరావునగర్‌కు చెందిన అంబార్కర్ వంశీభరత్‌కు ప్రకాశం జిల్లా ఒంగోలు ధారావారితోటకు చెందిన లక్ష్మికి 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. పెళ్లి అయిన దగ్గర నుంచి వంశీభరత్ తాగి వచ్చి లక్ష్మిని తిడుతూ, కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. వంశీభరత్‌కు ఆయన కుటుంబ సభ్యులకు వెంగళరావునగర్ లోని ఇంటి విషయపై తరచూ వివాదాలు జరిగేవి. దీంతో వంశీభరత్ అష్టలక్ష్మీనగర్‌లో ఇల్లు కట్టుకుని భార్య పిల్లలతో వేరుగా ఉంటున్నాడు. ఈ మధ్యకాలంలో లక్ష్మిని వంశీభరత్, అతడి సోదరుడు వంశీతోపాటు ఆయన భార్య హిమబిందు, అత్తమామలు తనిత, విజయభాస్కర్‌లు తరచూ వేధించేవారు. ఈ క్రమంలో శనివారం లక్ష్మికి, భర్త వంశీభరత్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి ఇంట్లోని హిట్ తాగి నురగలు కక్కుతూ అపస్మారక స్థితికి చేరుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. మృతురాలు లక్ష్మికి ఇద్దరు పిల్లలు. మృతురాలి సోదరుడు సురేంద్ర ఫిర్యాదుతో రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బీఆర్ అంబేడ్కర్ జయంతి

నెల్లూరు(వీఆర్సీ), ఏప్రిల్ 13: భారత రాజ్యాంగ నిర్మాత, భారత తొలి న్యాయ శాఖ మంత్రి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని ఆదివారం ప్రభుత్వ అధికారులు నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమేష్ తెలిపారు. అన్ని సామాజిక వర్గాలు అంబేడ్కర్ జయంతిని ఒక పర్వదినంగా భావించి జరుపుకోవడం విశేషం. ముఖ్యంగా దళిత, వెనుకబడిన వర్గాల ప్రజలు, సామాజిక వేత్తలు జరుపుకునే ఈ పండుగ ఎన్నికల పుణ్యమా అని అంతంత మాత్రంగా జరుగనుంది.

ఎమ్మెల్యే అవినీతిని సాక్ష్యాలతో నిరూపిస్తాం : ఎన్డీఏ నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్డీఏ కూటమి నాయకులు

కావలి, ఏప్రిల్13: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అవినీతి,అరాచకాలను సాక్ష్యాధారాలతో సహా నిరూపించటానికి తాము సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఎన్డీఏ కూటమి నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎమ్మెల్యే నివాసం ఉంటున్న ఇంటిలో కొంత భాగం ప్రభుత్వ స్థలంలో ఉందని, దాన్ని ఆధారాలతో నిరూపిస్తామన్నారు. అలాగే ఆయన తన అనుచరుల ద్వారా ఇసుక, మట్టి, గ్రావెల్, రియల్‌ఎస్టేట్ వ్యాపారుల నుంచి వాటాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలిలో చేసిన రౌడీయిజాలను సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. కావలిలో అమృత్‌పైలాన్, ముసునూరులో ఎన్టీఆర్ విగ్రహం కూల్చింది వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర, జనసేన జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య ప్రసంగించారు.

ఓటు నమోదుకు చివరి అవకాశం

నేటితో ముగియనున్న గడువు



నెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను మార్చే 'ఓటు' హక్కు పొందేందుకు చివరి అవకాశం ఆదివారం ముగియనుంది. నేటి రాత్రి వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఆన్‌లైన్ లేదా స్థానిక బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) లేదా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను అందజేయవచ్చు. ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి వచ్చే నెల 13వ తేదీన జగరనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఓటు హక్కును కల్పిస్తారు. ఆదివారం దాటాక కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకునేందుకు వీలుపడదు. దీంతో అర్హులైన 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. అదే సమయంలో గడిచిన రెండేళ్ల నుంచి జిల్లాలో రెండు లక్షలకుపైగా ఓట్లను తొలగించారు. ప్రజలు కూడా తమ ఓటును స్థానిక బీఎల్‌వో వద్ద లేక ఆన్‌లైన్‌లో గానీ పరిశీలించుకోవడం మంచిది. ఒకవేళ మీ ఓటు జాబితాలో లేక పోతే కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముంది. ఇప్పటి వరకు జిల్లాలో 20,48,252 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. అందులో పురుషులు 10,02,144 మంది, మహిళలు 10,45,917 మంది ఉండగా ఇతరులు 211 మంది ఉన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం మరో 7,932 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు ఆదివారం రాత్రి వరకు వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలించి అర్హులైన వారికి రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఓటు హక్కు కల్పించనున్నారు.

పురుషామృగ వాహనంపై సంగమేశ్వరుడు


పురుషామృగ వాహనంపై సంగమేశ్వరుడి గ్రామోత్సవం

సంగం, ఏప్రిల్ 13: స్థానిక సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి పురుషామృగ వాహనంపై సంగమేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు కామాక్షిదేవి, సంగమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను జలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేసి గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం సంగం పురవీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమానికి రొక్కరొక్కల నారాయణ - నరసమ్మ, రఘుపతి - శ్రీదేవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి పండరి భజన కోలాటం అలరించింది.

సోమశిలలో 8.688 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 13: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారానికి ప్రాజెక్టులో 8.688 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 320 క్యూసెక్కులు, డెల్టాకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మెట్ట ప్రాంత ప్రజల అభివృద్ధే ధ్యేయం!



టీడీపీలో చేరిన వారితో కాకర్ల సురేష్



ఆత్మీయ సమావేశానికి హాజరైన వలస వాసులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: హైదరాబాదులోని బీఎన్‌రెడ్డినగర్‌లో శనివారం నియోజకవర్గంలోని మండలాల నుంచి వలస వెళ్లి హైదరాబాదులో స్థిరపడ్డ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు పరిశ్రమల స్థాపనకు కృషి చేసి వలసల నివారణకు చర్యలు చేపడతామన్నారు. ఏ సమస్య ఉన్నా తనకు ఫోన్ చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో తనతో పాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయానికి సహకరించాలని కోరారు. అనంతరం కాకర్లను వలసవాసులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఆత్మీయ సమావేశానికి హైదరాబాదు నగరంలోని వనస్థలీపురం, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, బీఎన్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వలసవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

● **వింజమూరు:** పట్టణంలోని సుజాతనగర్‌లో శనివారం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాకర్ల సురేష్ తమ్ముడు సునీల్ భార్య సురేఖ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడా నర్సారెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు,

● వలసవాసుల ఆత్మీయ సమావేశంలో కాకర్ల సురేష్

మహబూబ్‌బాషా, చల్లా వెంకటేశ్వర్లు, గురజాల సుబ్బారావు, సాంబయ్య, తిరుపతి ఆచారి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడులో కరపత్రాలు పంచుతున్న కాకర్ల సురేష్ అన్న వెంకట్, వదిన రుక్మిణి, కోడలు మేఘన

మద్యం అమ్మకాల్లో జగన్ రూ.లక్ష కోట్ల దోపిడీ!

- వైసీపీ ట్రబుల్ ఇంజన్ సర్కార్‌ను కూలకొడదాం
- ఆత్మకూరు ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి
- డబుల్ ఇంజన్ సర్కార్‌ని అధికారంలోకి తీసుకొద్దాం



ఆత్మకూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 13: అధికారంలోకి వచ్చిన తరువాత అంచెలంచెలు గా మద్యంను నిషేధిస్తానని మహిళలకు హామీ ఇచ్చిన వైసీపీ అధినేత జగ న్ సీఎం అయ్యాక మద్యంలో రూ.లక్ష కోట్ల దోపిడీ చేశారని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన ఆత్మకూరులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం జగన్ జె బ్రాండ్స్‌తో జె గ్యాం గ్‌ను ఏర్పాటు చేసుకుని మద్యంలో సుమారు రూ.లక్ష కోట్లు నేరుగా జగన్ ఇంటికే చేరాయని మండిపడ్డారు. ఆయన స్వంత మనుషులు అనిల్‌రెడ్డి, వాసుదేవరెడ్డిలను మద్యం కార్పొరేషన్ చైర్మన్, ఎండీలుగా ఏర్పాటు చేసుకుని ఈ దోపిడీ చేశారని విమర్శించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న వాసుదేవరెడ్డి మద్యంలో వచ్చే ఆదాయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి పంపిస్తున్న వాసుదేవరెడ్డి ఇక ఏమాత్రం ఆ పదవిలో ఉండేందుకు అర్హత లేదన్నా రు. ఎన్నికల సుమోటో కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని టీడీపీ తరుపున ఎన్నికల సంఘానికి విన్నవిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో 312, 313 జీవోలు తెచ్చి బేవరీస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్యం కొనుగోలు, విక్రయం చేపట్టిందన్నారు. వచ్చే ఆదా యంలో 20ఏళ్ల పాటు బ్యాంకులకు తాకట్టు పెట్టి రుణం తెచ్చిన దుర్మార్గ ప్ర భుత్వమని విమర్శించారు. మద్యం నిషేధమని మాయమాటలు చెప్పి ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కిందని వైసీపీ ప్రభుత్వం అన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి అభ్యర్థినైన ఆత్మకూరు ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. జగన్ ఆధ్వర్యంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ట్రబుల్ ఇంజన్ సర్కార్‌ను కూలదోచి, డబుల్ ఇంజన్ సర్కార్ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూట మి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్

మున్సిపల్ కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి చిన్నపురెడ్డి వైసీపీని వీడి శనివారం ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా నరసాపురం మాజీ సర్పంచ్ అంపాటి రమాదేవి, చిట్టమూరి సుబ్బారెడ్డిలు వీరి వెంట ఉన్నారు. వీరికి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్, తెలుగుదేశం ఆత్మకూరు టౌన్ అధ్యక్షులు చంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి ఉన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

మర్రిపాడు: బూదవాడ సర్పంచ్ మంచాల హరిబాబు, ఇర్లపాడు గుర్రం నాగేశ్వరావుతో పాటు మరో 30కుటుంబాలు వైసీపీని వీడి శనివారం పుట్టం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. అనంతరం వారికి ఆనం రామనారాయణ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వలంటీర్ల రాజీనామా ఆమోదం

అంనతసాగరం, ఏప్రిల్ 13: మండలంలో రెండు రోజులుగా 70మంది వలంటీర్లు రాజీనామాలు చేయగా వారి వినతులను ఆమోదం చేసినట్లు శనివారం ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తెలిపారు. ఇందులో ఆమనిచిరివేళ్ల 11, ముస్తాపురం 5, పాతాళపల్లి 9, ఉప్పలపాడు 7, వరికుంటపాడు 5, అనంతసాగరం వన్ 12, అనంతసాగరం టూ 11, బొమ్మవరం 10మంది ఉన్నట్లు స్పష్టం చేశారు.

గ్రామాల్లో వైసీపీ ప్రచారం

ఉదయగిరి రూరల్: గండిపాళెం, వెంగళరావునగర్, గుడినరవ గ్రామాల్లో శనివారం నియోజకవర్గ వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఓబులరెడ్డి, జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మాజీ సొసైటీ అధ్యక్షులు వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

గాంధీజన సంఘంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సంగం: గాంధీ జన సంఘంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ర్యాలీగా ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శనివారం పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్ పోలింగ్, ఓటింగ్ ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారి నెహ్రాబాబు, మాస్టర్ ట్రైనర్ సమీవుల్లా, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ ఫలితాల్లో యువరాజ్‌కు అత్యధిక మార్కులు

వింజమూరు, ఏప్రిల్ 13: పట్టణంలోని శ్రీవివేకానంద హైస్కూల్ అండ్ కాలేజీ విద్యార్థి ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో యువరాజ్ అనే విద్యార్థి 1000 మార్కులకు 986 మార్కులు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం మద్దూరు గోపాల్‌రెడ్డి తెలిపారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని కృష్ణంపల్లి సెక్షన్ అటవీ శాఖాధికారి షేక్ మునీర్‌బాబు అన్నారు. శనివారం రేంజ్ అధికారి ఉమా మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు వెంగళరావునగర్, తోటలచెరువుపల్లి గ్రామాల్లో ఆయన అగ్నిప్ర మాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులను అటవీ ప్రాంతాల్లో పార వేస్తే వాతావరణ కాలుష్యానికి పెనుముప్పుగా మారుతుందన్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల వృక్ష సంపదతోపాటు వన్యప్రాణులు నశిస్తాయన్నారు. ప్రజలు అవగాహన కలిగి ఉండి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవోలు అప్జల్, కరీముల్లా పాల్గొన్నారు.

శేషవాహనంపై శ్రీరామచంద్రుడు



సంగం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్దిపురం సీతారామస్వామి రెండోరోజు (శుక్రవారం రాత్రి) శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు స్వామిఅమ్మవారిని జలాభిషేకం చేసి ప్రత్యేకంగా అలం కరించి పూజలు చేశారు. గజపూలమాలతో అలంకరించిన శ్రీరాముడు ఉత్సవ విగ్రహాన్ని శేషవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతించి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

అనంతసాగరం, ఏప్రిల్ 13: ఆత్మకూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపునకు కృషి చేయాలని, ఈ మారు టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని పార్టీ మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. శనివారం మండల తెలుగు యువత అధ్యకుడు గూడూరు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జనసేన నాయకులు చిలకలమర్రిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ విజయంకు దోహదపడే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మునగపాటి సుబ్బారాజు జనసేనికులు భరత్, రవి, కృష్ణమూర్తి యాదవ్, శ్రీనివాస్, వేణు, నరసింహరాయల్ పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి



అధికారులతో చర్చిస్తున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: ఈ నెల 18నుంచి జరుగనున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ, నామినేషన్ల నోడల్ అధికారి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఆర్వో కార్యాల యాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. అలాగే ఆర్వో గది, స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. ఆర్వో కార్యాలయ గేటు నుంచి వంద మీటర్ల వరకే వాహనాలను అనుమతించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన వెంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెహ్రాబాబు, కలిగిరి సీఐ ఫిరోజ్, ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్ట ప్రాంత అభివృద్ధికి చెంచురామయ్య కృషి

● నివాళులర్పించిన నాయకులు



చెంచురామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చెంచలబాబు, కాకర్ల సునీల్

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 13: గండిపాళెం జలాశయం సాధకులు, మాజీ ఎమ్మెల్యే, సమితి అధ్యక్షులు పొన్నెబోయిన చెంచురామయ్య 22వ వర్ధంతిని శనివారం స్థానిక చెంచు రామయ్య అతిథి గృహంలో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఈ ప్రాంత సాగు, తాగునీటి సమస్యలపై అసెంబ్లీలో తన స్వరాన్ని వినిపించాడన్నారు. ప్రభుత్వంతో పోరాడి గండిపాళెం జలాశయంతో పాటు 72 చెరువులను మంజూరు చేయించి నిర్మాణం చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జిల్లాలో బీసీ సామాజికవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి మెట్ట ప్రాంత అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఆయన్ను ఇప్పటికీ ప్రజలు మననం చేసుకుంటున్నారంటే అభివృద్ధి పనులే కారణమన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, మాజీ ఎంపీపీలు శ్రీకుర్తి రవీంద్రబాబు, మద్దసాని వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీలు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, కలివెల జ్యోతి, మాజీ సర్పంచ్ పీసీ అల్లూరురాజు, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, నాయకులు కాకర్ల సునీల్ పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

టీడీపీలోకి భారీగా చేరికలు

కొండాపురం, ఏప్రిల్13: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపు కోసం శనివారం హైదరాబాదులో వ్యాపార, ఉద్యోగరీత్యాల ఉన్నవారితో మండల టీడీపీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలపరిధిలోని గొట్టిగుండాలపాలెం సర్పంచి కోవి మాల్యాద్రితోపాటు గ్రామానికి చెందిన 100 మంది వైసీపీ కార్యకర్తలతోపాటు పలు పంచాయతీలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కాకర్ల వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● ఇంటూరికి ఇటుక బట్టీల వ్యాపారుల మద్దతు

వలేటివారిపాలెం : మండలంలోని కూనిపాలెం వలేటివారిపాలెం, రామచంద్రాపురం, పోకూరు, శాఖవరం, కళవళ్ల, తదితర గ్రామాలకు చెందిన వారు హైదరాబాద్‌లో ఉన్న ఇటుకబట్టీల వ్యాపారం చేస్తున్నారు. వీరంతా శనివారం కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ లో చేరారు. వారికి నాగేశ్వరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అవసరం ఎంతో ఉందని తెలిపారు. కావున టీడీపీని గెలిపించాలన్నారు.



వైసీపీ నాయకులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాకర్ల సురేష్



హైదరాబాద్‌లో ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన ఇటుక బట్టీల వ్యాపారులు

వాడవాడలా టీడీపీ నేతల ప్రచారం

ఉలవపాడు, ఏప్రిల్ 13 : స్థానిక కృష్ణానగర్‌లో టీడీపీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాచగల్లు సుబ్బారావు, మాల్యాద్రి, వెంకట్రావు, జిలానీబాషా, రవి,యలమందమ్మ, సుబ్బరత్తమ్మ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



కావలి 35వ వార్డులో ప్రచారం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి



ఉలవపాడు : ఇంటింటి ప్రచారంలో టీడీపీ శ్రేణులు

ముస్లింల అభ్యున్నతికి పాటుపడింది టీడీపీయే..

కందుకూరు, ఏప్రిల్ 13: ముస్లింల అభ్యున్నతి కోసం పాటుపడింది టీడీపీయేనని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య తెలిపారు. పట్టణంలోని 18వవార్డు, మోహన్ థియేటర్ వెనుక ప్రాంతాల్లో శనివారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయకృష్ణ, ముచ్చు శ్రీనివాసులు, ముచ్చు లక్ష్మీరాజ్యం, షేక్ మున్నా, షేక్ అబ్దుల్ ఫాజిల్, షేక్ బాబు, షేక్ రాహుల్, నాగరాజు సింగ్, సంగా పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమె పట్టణంలోని 17వ వార్డు తూర్పుకమ్మపాలెంలో శనివారం రాత్రి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దివి శ్రీనివాసరావు, ముచ్చు శ్రీనివాసులు, జంపాల శ్రీకాంత్, రావి వెంకటేశ్వర్లు, అమర రామలింగయ్య, బెల్లం వెంకటేశ్వర్లు, దివి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా : కావ్య

కావలి, ఏప్రిల్13: ఒక్క అవకాశం ఇవ్వండి.. కావలిలో అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని 3,35 వార్డుల్లో శనివారం ఆయన ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. 10 ఏళ్లుగా కావలికి ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలికి ఏమి అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు తోట వెంకటేశ్వర్లు, కొమరా రమణయ్య స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

మన హక్కులను మనమే కాపాడుకుందాం !

అల్లూరు, ఏప్రిల్ 13 : మన హక్కులను మనమే కాపాడుకుందామని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కరిస్ట్ కావలి నియోజకవర్గ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని పురిణి గ్రామంలో పర్యటించారు. ఇంటింటా తిరిగి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో కోసూరు బాబు, ముసలి నరేంద్ర, నక్కా గిరి, కప్పల నవీన్‌కుమార్, కిరణ్‌కుమార్ , నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే మద్యం దుకాణాల మూత

లింగసముద్రం, ఏప్రిల్ 13: ఎన్నికల సీజన్ మొదలవడంతో పది రోజుల నుంచి లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు మధ్యాహ్నం మూడు గంటలకే మూతపడుతున్నాయి. లింగసముద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణం శనివారం మధ్యాహ్నం 3 గంటలకే మూతపడింది.వాస్తవానికి ఈ దుకాణాలు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేయాలి.కానీ 10 రోజుల నుంచి ఈ దుకాణాల్లో రోజువారీ అమ్మకాల టార్గెట్లు పూర్తి అవుతున్నాయని కారణంతో మూతవేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ప్రతి దుకాణంలో రోజూ రూ.2.01 లక్షలకు మద్యం అమ్మాల్సి ఉందని సిబ్బంది తెలిపారు.ఈ మేరకు మద్యం అమ్ముతున్నందున ముందుగానే మూసి వేస్తున్నట్లు వారు చెప్పారు. ఈ షాపులపై పెద్దగా తనిఖీలు లేకపోవడంతో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కేంద్ర బలగాల కవాతు



కావలి రూరల్ : కావలి మండలం చౌదరిపాలెం, ముసు నూరు గ్రామాల్లో శనివారం రూరల్ సీ ఐ కాటూరి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించా యి. రానున్న ఎన్నిక లను దృష్టిలో పెట్టు కుని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజల కు భరోసా కల్పించేందుకు ఈ కవాతు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 9,42,577

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.9,42,577 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 5,750, కుంకుమార్చన ద్వారా రూ. 22,600, వివాహాల ద్వారా రూ. 7 వేలు, తలనీలాల ద్వారా రూ. 39,275, వాహనపూజల ద్వారా రూ. 2,900, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,96,500, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 8,20, రూముఅద్దెల ద్వారా రూ. 31,960, కవర్లు ద్వారా రూ. 6,900, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,27,065, అన్నదానం ద్వారా రూ. 2,92,807, విరాళాల ద్వారా రూ. 9 వేలు ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

● నృసింహుడి సేవలో మహీధర్‌రెడ్డి

మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రదాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు.

బోగోలులో ప్రతాప్‌రెడ్డి ప్రచారం

బిట్రగుంట : బోగోలులో కావలి వైసీపీ అభ్యర్థి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. వైసీపీ నేతలు వీరరఘు, సుజాత, అనిత, కీర్తనలు తదితరులు ఆయనతో కలిసి బోగోలు, అరుంధతీవాడ,హరిజనవాడల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో దేవరాల సుబ్రహ్మణ్యం, కౌశల్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండాగా ప్రజల ముందుకు..



కావలి పట్టణంలో పర్యటిస్తున్న పసుపులేటి సుగుణమ్మ

కావలిటౌన్, ఏప్రిల్13: అభివృద్ధే ప్రధాన అజెండాగా ప్రజల ముందుకు వెళుతున్నామని స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ పేర్కొన్నారు. శనివారం ఆమె పట్టణంలోనూ, రూరల్ మండల కొత్తసత్రంలోనూ పర్యటించారు. సుధాకర్ విడుదల చేసిన సొంత మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కావలి అభివృద్ధి కోసం అందరూ తమవెంట కలిసి అడుగులు వేయాలన్నారు. పార్టీలకతీతంగా ప్రజలు ముందుకొచ్చి తమతో కలిసి రావడం సంతోషంగా ఉందన్నారు. తాము మాటలు చెప్పే రకం కాదని, అధికారం లేకపోయినా స్వంత నిధులతో అభివృద్ధి చేసి చూపించిన వారమన్నారు.

● పలువురి చేరిక

పట్టణంలోని 33వ వార్డుకు చెందిన జనసేన కార్యకర్తలు సుగుణమ్మ సమక్షంలో పసుపులేటి కండువాలు కప్పుకున్నారు. సుధాకర్‌కు మద్దతు తెలిపిన వారిలో ఆనాల బ్రహ్మయ్య, సరస్వతి, కోటేశ్వరరావు, తోట భాగ్యమ్మ, కరుణ, మునీంద్ర, బూచి మనోహర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ శిక్షణ కేంద్రం పరిశీలన



టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 13: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీవోలు, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరు హరినారాయణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకు ముందు జాతీయ రహదారిపై తెట్టు సమీపంలో ఏర్పాటుచేసి ఉన్న ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. తనిఖీలన్నీ సీసీ కెమెరాలో ఉండాలని తెలిపారు. ఆయన వెంట కందుకూరు సబ్ కలెక్టరు జీ విద్యాధరి తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను దెబ్బతీసిన వారిని వదలం

కావలి, ఏప్రిల్ 13 : అంబేడ్కర్ ఆశయాలను దెబ్బతీసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తేలేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి తెలిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపి, ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి గ్రామగ్రామాన జగనన్న పాలనలో దళితులకు, గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని తెలియచేస్తామన్నారు. గతంలో అంబేడ్కర్ జయంతికి దళితలకు అనేక పథకాలను అందచేసేవారిని, వైసీపీ అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ జయంతిని పూర్తిగా విస్మరించారన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు జరుగుమల్లి విజయరత్నం,చౌటూరి వెంకటరత్నం,జడ్డా వాసు, ముక్కు మోహన్‌రావు, కనకాల ఏడుకొండలు, తిరుపతి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య మాస్టర్ మృతికి నివాళి

బిట్రగుంట, ఏప్రిల్ 13: బోగోలు మండలం అక్కరాజువారికండ్రికకు చెందిన సుందరయ్య మాస్టారు (90) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా, శనివారం ఆయన పార్థివ దేహాన్ని పలువురు సందర్శించి పలువురు నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో కావలి స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్, ఆయన సోదరుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు మాలేపాటి నాగేశ్వరావు, మస్తాన్‌రావు, బీజేపీ నేతలు గుర్రం వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రావు, జైభీం అంబేడ్కర్ వ్యవస్థాపకుడు రవిచంద్ర, అంథోనీ ఉన్నారు.

ఎస్పీ పోలీసు స్టేషన్ తనిఖీ

బిట్రగుంట, ఏప్రిల్ 13: బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప పోలీస్‌స్టేషను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి స్థానిక పరిస్థితుల గురించి కావలి డీఎస్పీ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కావలి రూరల్ సీఐ నాగభూషణం, స్థానిక ఎస్సై బోజ్యా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో...

అల్లూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాత్రి జిల్లా ఎస్పీ ఎస్.కె.ఆరీఫ్ హఫీజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐదు నిమిషాలపాటు అల్లూరు పోలీస్ స్టేషన్‌లో తనిఖీ చేశారు. మండలంలోని పోలింగ్ బూత్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

ఓటమికి భయపడే వైసీపీ దుష్ప్రచారం : ప్రశాంతిరెడ్డి



కోవూరులో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



విడవలూరు: టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఏప్రిల్ 13: ఓటమికి భయపడి వైసీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు పట్టణంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను అందరికీ అందుబాటులో ఉంటాననీ, సమస్యల్ని తమ దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా తాము కోరుకున్న వ్యాపారాలు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతీ ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును ఎన్నుకోవాలని, పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆమె కోరారు. కోవూరు చెరువుకట్ట సమీపంలోని ఆలయంలో పూజల అనంతరం ఆమె ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ కమిటీ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, సర్పంచు విజయ, నాయకులు కాటంరెడ్డి కృష్ణారెడ్డి, ఇంతా మల్లారెడ్డి, జనసేన నాయకుడు చప్పిడి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందుల్లో పడేసిన వైసీపీ భూసర్వే

బుచ్చిరెడ్డిపాళెం: వైసీపీ చేపట్టిన భూసర్వే రైతులను ఇబ్బందుల్లో పడేసిందని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గ్రామాల్లో భూసమస్యలు పరిష్కరిస్తామని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మునులపూడి పంచాయతీలోని మునులపూడి, రెడ్డిపాళెం, కొండాయగుంట గ్రామాలలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాణెం వెంకురెడ్డి, గండి పెంచలకృష్ణలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాణ్యం సుబ్బారెడ్డి, బిజ్జం పెంచలరెడ్డి, పామాటి వెంకటేశ్వర్లు, ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు.

టీడీపీలో 30 కుటుంబాలు చేరిక

రెడ్డిపాళెంలో ఎన్నికల ప్రచారంలో ప్రశాంతిరెడ్డి సమక్షంలో మునులపూడి మాజీ సర్పంచు తాటిపర్తి బాబుతోపాటు పలువురు ఆయన అనుచరులు, నాగమాంబాపురం నుంచి 30 కుటుంబాల వారు కత్తి మహేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి ప్రశాంతిరెడ్డి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

100 మంది వైసీపీ కార్యకర్తలు...

విడవలూరు: చౌకిచర్ల గ్రామంలో స్థానిక టీడీపీ నాయకులు ఓగు నాగేశ్వరరావు, సమాది శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బీసీ నాయకుడు తూపిలి చిన్నరాఘయ్య, వార్డు మెంబరు విజయమ్మ, తూపిలి శ్రీహరి, ఈదూరు సురేష్‌లతో పాటు సుమారు 100 మంది టీడీపీలో చేరారు. వీరికి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల కృష్ణ చైతన్య, బెజవాడ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

- నరక యాతనగా నెల్లూరు - తాటిపర్తి రహదారి
- ఏళ్లుగా పట్టించుకోని పాలకులు



సౌత్‌మోపూరు దాటాక రోడ్డు దుస్థితి

గజానికో గొయ్యి..!

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 13 : నెల్లూరు నుంచి తాటిపర్తి రహదారి మీదుగా గొల్లకందు కూరు గ్రామానికి ఒక్క బాడుగ వాహనం కూడా రాదు. ఇదే రోడ్డుమీద సౌత్‌మోపూరు, వెల్లంటి గ్రామాలకు అత్యవసర సర్వీసు లను తీసుకెళ్లాలన్నా కష్టమే. కనీసం స్కూటర్‌లో ప్రయాణం చేయాలన్నా నరకయాతనే....! ఈ దుస్థితి ఇప్పటిదికాదు. కొన్నేళ్లుగా ఆయా గ్రామాల ప్రజలు సౌకర్యవంతమైన రవాణాకు నోచుకోవడం లేదు. జొన్నవాడ కూడలి నుంచి గొల్లకందుకూరు వరకు దూరం 16 కిలోమీటర్లు. ప్రయాణ సమయం మాత్రం ఒకటిన్నర గంటకుపైనే!. కనీసం గుంతలు పూడ్చని వైసీపీ ప్రజాప్రతినిధులు ఏకంగా ఈ రోడ్డును నూతన హంగులతో నిర్మించేస్తామంటూ కొన్ని నెలల క్రితం ఆర్భాటంగా ప్రకటించి ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. గొల్లకందుకూరు, సజ్జాపురం, కొత్తవెల్లంటి, పాతవెల్లంటి, కందమూరు, సౌత్‌మోపూరు, ములుముడి, కొమ్మరపూడి, దేవరపాళెం గ్రామాల ప్రజలు నిత్యం నెల్లూరు - తాటిపర్తి రహ దారిపై రాకపోకలు సాగిస్తుంటారు. గొల్లకందుకూరు ఇసుక రీచ్ నుంచి భారీగా వాహనాల్లో ఇసుక తరలించడంతో నాలుగేళ్ల క్రితం రోడ్డు దెబ్బతిన్నది. ఇప్పటికీ ఈ రోడ్డు ఆధునికీకరణకు నోచుకోలేదు. గుంతలు కాస్తా గోతులైనా పాలకులు పట్టించుకున్న పాపనపోలేదు. వైసీపీ నాయకులు, ఆ పార్టీలోని ప్రజాప్రతినిధులు నిత్యం పలు గ్రామాలకు పర్యటనల కోసం ఈ రహదారి మీదుగానే వెళ్లి వస్తుంటారు. అయినా ఏ ఒక్కరూ చొరవ చూపిన దాఖలాలు లేవు. గతేడాది కురిసిన వర్షాలకు ఈ రహదారిపైనున్న గుంతలు బావులుగా మారాయి. వాటిలో కొందరు ఈతకొడుతూ నిరసన తెలిపినా యంత్రాంగానికి చురుకు పుట్టలేదు. ఇలా.. ప్రజలను రహదారి కష్టాలకు వదిలేసిన వైసీపీ నాయకులు తాజాగా ఎన్నికల్లో ఓటు వేయమని అడిగేందుకు ఆయా గ్రామాలకు వెళ్లడానికి సంకోచిస్తున్నారు.



ములుముడి కలుజు కల్వర్టు వద్ద గుంతలు



దేవరపాళెం వద్ద దెబ్బతిన్న రహదారి

వైభవంగా నందివాహన సేవ



నందివాహనంపై పార్వతీపరమేశ్వరులు

మనుబోలు, ఏప్రిల్ 13: శ్రీ కామాక్షితాయి సంగమేశ్వర బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారికి నందివాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఉభయదాతలుగా చిట్టమూరు సురేంద్రరెడ్డి, సునంద దంపతులు వ్యవహరించారు. శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి నందివాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం వరకు నందిసేవ వైభవంగా సాగింది. నందిసేవ సందర్భంగా మెట్టు మల్లారెడ్డి, భవాని దంపతులు రూ. 25వేలు విలువచేసే నూతన గొడుగులను ఆలయానికి అందజేశారు. ఆదివారం శివపార్వతుల కల్యాణం బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న సంగమేశ్వరాలయంలో జరగనున్నట్లు అర్చకులు సర్వేపల్లి పణీంద్రశర్మ తెలిపారు.

ఘనంగా నృసింహుడి కల్యాణం

రాపూరు(డక్కిలి), ఏప్రిల్ 13: పెంచలకోన నృసింహస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 4గంటలకు స్వామి అభిషేకం, సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరుచ్చి పల్లకీసేవ, సహస్ర దీపాలంకరణ (ఊంజల్ సేవ) చేపట్టారు. దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ సహాయ కమిషర్ కేవీ సాగర్‌బాబు ఏర్పాట్లు చేపట్టారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 13: బీసీల సంక్షేమం టీడీపీ ధ్యేయమని మండల టీడీపీ కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి అన్నారు. మండలంలోని కొరుటూరులో శనివారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుం దన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, కిషోర్‌యాదవ్, జనార్థన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కే స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి : టీఎన్ఎస్ఎఫ్

వెంకటాచలం, ఏప్రిల్ 13 : మండలంలోని సర్వేపల్లి గ్రామంలో ఉన్న ఎస్ఆర్‌కే ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి డిమాండ్ చేశారు. వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల మహిళ ప్రాణాలు కోల్పోయిందని, రోడ్డు ప్రమాదంపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మనోజ్, మస్తాన్, కాలేషా తదితరులున్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 13: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ ఎంతో మేలు జరుగుతుం దని పూర్వ కలెక్టర్, కాంగ్రెస్ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు అన్నారు. శనివారం స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి అధ్యక్షతన నెల్లూరు ఎంపీ అభ్యర్థి కే రాజు, ఆపార్టీ కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి నెల్లబాక మోహన్‌తోపాటు సీపీఎం, సీపీఐ నాయకులతో కలిసి మండలస్థాయి బీఎల్‌ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్న తనను, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నెల్లబాక మోహన్‌ను హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్, మండలాధ్యక్షుడు కిషోర్, చల్లకొలుసు మల్లికార్జున, మహిళా నాయకురాలు నూర్జహాన్, బీఎల్ఏలు, నాయకులు పాల్గొన్నారు.

సుహాసినికి భారతీయ నారీ రత్న అవార్డు

కొడవలూరు, ఏప్రిల్ 13: జాతీయ మానవ హక్కుల సామాజిక న్యాయ కమిషన్ రాష్ట్ర అధ్యక్షురాలు చెముడుగుంట సుహాసినికి భారతీయ నారీరత్న అవార్డు రావడం హర్షనీయమని మండల టీడీపీ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో న్యాయమూర్తి జి శేఖర్ చేతుల మీదుగా సుహాసిని అవార్డు తీసుకున్నారని తెలిపారు.

విగ్రహం దిమ్మెను ఢీకొన్న లారీ

- తప్పిన ప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 13: నెల్లూరు వైపు నుంచి బుచ్చి బస్టాండ్ వైపు వెళ్తున్న ఓ లారీ బుచ్చిలోని జొన్నవాడ రోడ్డు సెంటర్లో అంబేద్కర్ విగ్రహం దిమ్మెను ఢీకొన్న సంఘటన శనివారం వేకువజామున జరిగింది. ఈ ప్రమాదంలో దిమ్మ ధ్వంసం కాగా, ప్రమాద సమయంలో జనసంచారం, వాహన రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి

కొడవలూరు, ఏప్రిల్ 13: వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యల్లయపాళెంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఓటువేసి గెలిపిస్తే అభివృద్ధిచేసి చూపిస్తామన్నారు. టీడీపీ నాయకులు గరికపాటి రాజేంద్రకుమార్, బూలోకం విజయ్‌కుమార్, కేతూ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **వేమిరెడ్డి కోడలు ఐషితారెడ్డి ప్రచారం**

మండలంలో రామన్నపాళెంలో టీడీపీ నాయకుడు డేగా దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోడలు ఐషితారెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా ఆదరించండి : సోమిరెడ్డి



వెంకన్నపాలెంలో పార్టీలో చేరిన వారితో సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 13: మత్స్యకార గ్రామాలన్నీ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందాయని, ఈ ఒక్కసారి ఆదరించి గెలిపించాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు. మండలం లోని వెంకన్నపాలెం మత్స్యకార గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెంకన్నపాలెం గ్రామంలో వైసీపీ ఉప సర్పంచ్ కటారి పోలయ్య, పెద్దకాపు పామంజి నరసింహులు, 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, బండి శ్రీకుమార్ రెడ్డి, చింత సీతారామయ్య, పామంజి రామకృష్ణ, సుమన్, మత్స్యకార నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాటమీద నిలబడు కాకాణీ..

మనుబోలు: డేగపూడి-బండేపల్లి కాలువ తీసుకురాకపోతే ఓట్లడగనన్న మంత్రి కాకాణి మాటమీద నిలబడాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. చెర్లోపల్లిలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ మంత్రి కాకాణి ఆ శాఖకే మచ్చ తీసుకువచ్చారన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు పొన్నూరు అశోక్, కలికి వేణుగోపాల్‌రెడ్డి బీజేపీ, జనసైనికులు పాల్గొన్నారు.

కసుమూరు దర్గాలో సోమిరెడ్డి కుమార్తె పూజలు

వెంకటాచలం, ఏప్రిల్ 13: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల్లో గెలవాలని మండలంలోని కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో శనివారం మాజీ మంత్రి సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కసుమూరు గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజాయాదవ్, రాధాకృష్ణమనాయుడు, వెంకయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

- **కోడలు శృతిరెడ్డి ప్రచారం**

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి శృతిరెడ్డి కోరారు. వెంకటాచలంలో శనివారం ఆమె సోమిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం నాగూర్‌మీరయ్య నిషాన్ దర్గాలో సోమిరెడ్డి గెలుపు కోసం ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్, కుంచి శ్రీనివాసులు, ధనుంజయ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీతో సోమిరెడ్డిని గెలిపించాలి : తలచీరు

పొదలకూరు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు కోరారు. శనివారం పట్టణంలోని నరసారెడ్డికాలనీ, కాకుమాని లే అవుట్‌లో ఎన్నికలలో ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బక్కయ్యనాయుడు, దేవినేని శరత్ పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయండి : కలెక్టర్



చెక్‌పోస్టు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

వెంకటాచలం, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులు, ఇతర ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదేశించారు. వెంకటాచలంలోని టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాత్రివేళల్లో కూడా తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని, ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు వాహనాలు, లారీలను క్షుణంగా తనిఖీలు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను కూడా తనిఖీలు చేయాలని, ఎటువంటి అనుమతి లేకుండా రవాణా చేసే పార్శిళ్లను సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పార్శిల్‌కు బిల్లులను సరిచూడాలన్నారు. కలెక్టర్ వెంట డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ అంకమరావు, చెక్‌పోస్ట్ అధికారిని కళారాణి తదితరులున్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి ఎం హరి నారాయణన్ సూచించారు. వెంకటాచలంలోని క్యాబా ఇంజనీరింగ్ కళాశాలలో పీవో, ఏపీవోలకు నిర్వహిస్తున్న ఎన్నికల శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈనెల 15న మరో విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు, ఏఆర్‌వో పూర్ణచంద్రరావు, డీటీ మురళీ తదితరులున్నారు.

టీడీపీ మీద కోపం నిరుపేదలపై చూపిస్తారా?

- వైసీపీ ప్రభుత్వంపై పొంగూరు నారాయణ ఆగ్రహం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 13 : తెలుగుదేశం పార్టీపై ఉన్న కోపాన్ని నిరుపేదలపై చూపిస్తూ గడిచిన ఐదేళ్లలో వారిని వేధించడమే పనిగా పెట్టుకున్న వైసీపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ మంత్రి, టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 4, 5 డివిజన్లలో పర్యటించారు. హుందాగా రాజకీయాలు చేయాల్సిన పరిస్థితుల్లో వైసీపీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. నిర్మించిన టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు పేదవాళ్ల కడుపునిండా అన్నం తినే అన్నా క్యాంటీన్లను మూసి వేయడం దారుణమన్నారు. ఆ ఇళ్లన్నీ నిర్వీర్యమైపోయాయని, కోట్లాది ప్రజాధనం వృథా అయి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులను పట్టించుకో కుండా నిర్లక్ష్యం వహించారన్నారు. జగన్మోహన్‌రెడ్డికి సంక్షేమం అంటేనే పట్టదని, కేవలం అధికార దాహంతోనే కాలం వెళ్లదీశాడన్నారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే వారిపై దాడులకు పాల్పడడం, కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించడం తప్ప జగన్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. అన్ని సమస్యలకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడమేనని, రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మైపాడుగేటు సెంటర్, ఆంజనేయస్వామి గుడి తదితర ప్రాంతాల్లోనూ ఇంటింటి ప్రచారం చేసి పార్టీ సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. మే 13వ తేదీన వైసీపీకి చివరి తేదీ అని, రాష్ట్రం నుంచి ఈ పార్టీని తరిమికొట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగరాధ్యక్షులు మామిడాల మధు, నేతలు పాల్గొన్నారు.

- అదేవిధంగా 48వ డివిజన్‌లో పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించి రానున్న ఎన్నికల్లో నారాయణను, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు.

వలంటీర్ల భవిష్యత్‌కు చంద్రబాబు భరోసా

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 13 : వలంటీర్లకు తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. శనివారం నగరంలోని 14వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నేతలు ఉచ్చి భువనేశ్వర్‌ప్రసాద్, మల్లికార్జున, గోపాల్ నాయుడు, సుధాకర్ నాయుడు, సుభాన్‌బాషా, యలమందారెడ్డి, గౌసియా, శేషయ్య నాయుడు, శ్రీనివాసులు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం గెలుపు చారిత్రక అవసరం

- టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి



పార్టీలో చేరిన వారితో కోటంరెడ్డి

నెల్లూరురూరల్, ఏప్రిల్ 13 : రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా ఏపీలో తెలుగుదేశం గెలుపు చారిత్రిక అవసరమని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మండలం లోని మాదరాజుగూడూరులో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంగా గద్దెనెక్కిన జగన్ ఇష్టానుసారంగా కరెంట్ చార్జీలను పెంచుకుంటుపోయి వాటిని సాకుగా చూపి సంక్షేమ పథకాలను తొలగించారన్నారు. అవ్వ, తాతల పింఛన్ రూ.4 వేలు ఇస్తామన్న చంద్రబాబు ఏప్రిల్ నుంచే ఈ మొత్తాన్ని అమలు చేస్తారన్నారు. సామాన్యులకు ఆర్థిక ఊరటను కల్పించేందుకు నిత్యావసర ధరలు తగ్గిస్తారన్నారు. అంతకు ముందు 20వ డివిజన్ గంగోత్రినగర్‌కు చెందిన పీడూరు శ్రీనివాసులురెడ్డి, హరనాథ్‌బాబు, 24వ డివిజన్‌కు చెందిన ఉడతా సుధాకర్, 23వ డివిజన్ పడారుపల్లికి చెందిన నరాల ఇంద్రసేనారెడ్డి, అంకిరెడ్డిలు నెల్లూరులోని కార్యాలయంలో టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లూరు యువతి మేఘనకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మేఘన

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 13 : నెల్లూరుకు చెందిన మునగాల మేఘన ముంబై ఐఐటీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ సాధించారు. సస్టైనబుల్ ఒలరైజేషన్ ఆఫ్ షుగర్ ఇండస్ట్రీ వేస్ట్ త్రూ సర్క్యులేషన్ ఎకానమీ అప్రోచెస్ అనే అంశంపై థీసిస్‌ను సమర్పించడంతో ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె తిరుచ్చిలోని శాస్త్ర విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ పూర్తి చేసి హైదరాబాద్ ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం ముంబై ఐఐటీలో పీహెచ్‌డీలో చేరి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులైన డిప్యూటీ తహసీల్దారు విజయ నిర్మల, అంగ్ల ఉపాధ్యాయులు రంగారావు తమ కుమార్తె డాక్టరేట్ సాధించడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

కొప్పుల రాజుకు మద్దతివ్వండి

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 13 : నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, నెల్లూరు జిల్లా మాజీ కలెక్టర్ కొప్పుల రాజుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఏడుగుండ్ల విజయకుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం జర్నలిస్టు భవన్‌లో విలేకరులతో మాట్లా డారు. విద్యావంతుడైన కొప్పుల రాజుతో పాటు ఉమ్మడి నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలి పించుకుంటే జిల్లా అభివృద్ధి జరుగుతుందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ బాషా, కే.ఆదిల్, శ్రీనివా సులు, గన్నయ్య, తదిత రులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పగుడిలో విషుకణి

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 13 : నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం కేరళ ఉగాది విషుకణి పూజలు జరుగుతాయని ఆలయ చైర్మన్ జి.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు, విశేష పూజలు, సర్వాభరణాల అలంకరణలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులకు స్వామివారి సన్నిధిలో ఉంచిన చిల్లర నాణెలు స్వామివారి ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేస్తారని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో కేఏసీ విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 13 : ఇంటర్మీడియట్ ఫలితాల్లో నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్ హెచ్ఈసీలో డీవీ.శ్రావిక 964, సీఈసీలో పి.నాగలక్ష్మి 929, ఎంపీసీలో కె.కుమారస్వామి 926 మార్కులు సాధించగా ఒకేషనల్ కంప్యూటర్ సైన్స్ (సీఎస్ఈ)లో ఈ.పల్లవి 953, ఈఈటీలో పి.సంతోష్ 948, ఎంఎల్‌టీలో పి.ప్రవల్లిక 925 మార్కులు సాధించారన్నారు. అలాగే జూనియర్ ఇంటర్ హెచ్ఈసీలో పి.వెంకటసాయి యోషిక 465, ఎంపీసీలో ఎస్‌కె.ఫర్హానా 455, బైపీసీలో పి.లలిత 402 మార్కులు సాధించగా ఒకేషనల్ సీఎస్ఈలో ఎస్‌కె.అక్బర్ 489, ఓఏలో సీహెచ్.సాహితి 465, సీటీలో ఎస్‌కె.వాసిఫాఆయేషా 429 మార్కులు సాధించారన్నారు. ప్రభుత్వ కళాశాలలో తక్కువ ఫీజులతో, ఉత్తమ బోధనతో మంచి ఫలితాలు సాధించామన్నారు. తల్లిదండ్రులు దీన్ని గుర్తించి ప్రతిభ కలిగిన విద్యార్థులను కళాశాలలో చేర్పించాలని తెలిపారు.

నందివర్ధన పూలతో అర్చన

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 13 : శబరి శ్రీరామ క్షేత్రంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామికి గంధం కలిపిన జలాలతో అభిషేకం జరిగింది. ఉదయం, సాయంత్రం నందివర్ధనం పూలతో అభిషేకం, ఉదయం, సాయంత్రం అత్తి సమిధలతో హోమాలు, ప్రసాదాలు పంపిణీ జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు నరేష్‌స్వామి, ధర్మకర్తలు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయం పునఃనిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 13 : నగరంలోని నవాబుపేటలోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం పునఃనిర్మాణం కోసం శనివారం ఉదయం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ దంపతులు పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయం గర్భగుడి పూర్తిగా కృష్ణశిల రాయితో నిర్మిస్తున్నామన్నారు. దాతలు సహకారంతో రూ.3 నుంచి రూ.4కోట్ల వ్యయంతో ఈ ఆలయం నిర్మాణం అన్ని హంగులతో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు చుండూరు సుదర్శన్, ఉపాధ్యక్షులు గుర్రం వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి రాజశేఖర్, కార్యదర్శి పైడా హనుమంతరావు, సహాయ కార్యదర్శులు కర్నాటి నిరంజన్‌కుమార్, రవ్వా వెంకటరమేష్‌బాబు, ఆలయ ట్రస్ట్ వంశపారంపర్య సభ్యులు పాల్గొన్నారు.

అరణ్యకాండ ప్రవచనం



సన్మానం అందుకుంటున్న సింగరాజ రాంప్రసాద్‌రావు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 13 : నగరంలోని రేబాలవారి వీధిలో పీటీ రాజన్ టవర్స్‌లో పద్య సార్వత్రిక పరిషత్ ఆధ్వర్యంలో 3వ రోజు శ్రీరామ కథా తరంగిణి సప్తాహంలో ప్రముఖ వైద్యులు సింగరాజు శ్రీరామ ప్రసాద్‌రావు అరణ్యకాండపై ప్రవచనం చేశారు. అరణ్యకాండంలో ఏమి జరిగింది. వాటి విశిష్ట ఫలితాలు, అరణ్యకాండం ఎందుకు చదవాలో వంటి విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమానికి సభాపోషకులుగా కె.గోవిందాచార్యులు, రమాదేవి దంపతులు వ్యవహరించగా పద్య సారస్వత పరిషత్ కమిటీ పీటీ రాజన్ టవర్స్‌వాసులు పర్యవేక్షించారు.

అంబేడ్కర్ సాక్షిగా..

ఐదేళ్ల అరాచకం

దళితులపై దాడులు.. దౌర్జన్యాలు.. వేధింపులు..



నా ఎస్సీలూ.. నా ఎస్టీలూ.. నా బీసీలూ.. నా మైనారిటీలూ.. అని ముఖం నిండా అమాయకత్వం నింపుకుని నమ్మబలికే నాయకుల మాటలన్నీ అబద్ధాలే! ఎన్నికల్లో ఓట్లు అవసరం అయినపుడూ, అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రాం వంటి మహనీయుల వర్ధంతి, జయంతి రోజుల్లో మాత్రమే ఎస్సీలు గుర్తుకొస్తారు. ఊపిరాడనంతగా విగ్రహాలను పూలదండలతో ముంచెత్తి, ఉపన్యాసాలతో ఊగిపోతారు. ఆ తర్వాత అణగారిన వర్గాలను గాలికొదిలేస్తారు. అగ్రవర్ణ సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తారు. పేరుకు పదవులిచ్చి, అధికారం తమ దగ్గరే దాచుకుంటారు. అందుకు నిలువెత్తు నిదర్శనమే ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలన. జిల్లాలో దళితులను అవమానించి, దౌర్జన్యాలు చేసి, వారి భూములు లాక్కుని ఇప్పుడు మళ్లీ ఇంకో ఛాన్సు ఇవ్వండంటూ అడుగుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



చిల్లకూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల వసతిగృహం గదుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, అపరిశుభ్రంగా తాగునీటి కుళాయిలు

ఇచ్చిందెంత.. లాక్కున్నదెంత?

నవరత్నాల నిధులు ఇచ్చి దళితుల జీవితాలు మార్చేశాం అంటూ వైసీపీ గొప్పలు చెప్పుకుంటోంది. నిజానికి బటన్ నొక్కి చేసిన సాయంకన్నా దొంగదారుల్లో వారి నుంచి లాక్కున్నదే ఎక్కువ. ఐదేళ్ల కిందట నెలకు కరెంటు బిల్లు ఎంత వచ్చేది.. ఇప్పుడు ఎన్ని రెట్లు పెరిగింది అని పోల్చుకుంటే చాలు అమ్మ జగనా! అనకుండా ఉండలేరు. సంపూర్ణంగా మద్యం నిషేధించిన తర్వాతే మీ ముందుకు వచ్చి ఓట్లు అడుగుతా అని ప్రకటించిన జగన్ జె బ్రాండ్ చీప్ లిక్కర్‌ను ముంచెత్తి దండుకుంటున్నారు. పేద దళిత కుటుంబాల్లో సంపాదన అంతా మగవాళ్ల మద్యానికే సమర్పించుకోవాల్సి వస్తోంది. పెట్రోలు మొదలు ఉప్పూ, పప్పూ సహా ధరలన్నీ పెరిగిపోయి కుటుంబాలు గుల్లవుతున్నాయి. మరి దళితులకు జగన్ చేసింది మేలా, కీడా.. అని గత ఎన్నికల్లో ఓట్లేసిన దళిత కుటుంబాలు చర్చించుకుంటున్నాయి.

వివక్ష.. అవమానం..



వైసీపీ సమావేశంలో కుర్చీ లేకుండా వెనుక నిలబడి వున్న సత్యవేడు అభ్యర్థి రాజేష్

వైసీపీలో దళితుల పట్ల వివక్ష అనేక సందర్భాల్లో వెల్లడవుతూనే ఉంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా విలువలేని పదవుల్లోనే కొనసాగారు. అగ్రవర్ణ నేతలతో సమానంగా అధికారాన్ని ఒక్క దళిత ప్రజాప్రతినిధి కూడా అనుభవించలేదు. అనుభవించనివ్వలేదు. రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేల స్థానాల జోలికి ఎక్కడా వెళ్లని జగన్.. ఎస్సీ ఎమ్మెల్యేలతో మాత్రం ఆడుకున్నారు.

కాళ్లు పట్టుకున్నా ఆదిమూలాన్ని కనికరించలేదు!

సత్యవేడు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆధిపత్య కులానికి చెందిన బడా నేతలు చెప్పిందే అధికారంలో ఉన్న ఐదేళ్లూ చేశారు. అయినా టికెట్ లేదన్నారు. తిరుపతి ఎంపీగా పోటీ చేయమని ఆదేశించారు. కన్నీరు మున్నీరైన ఆయన తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తనకు సత్యవేడులోనే పోటీ చేసే అవకాశం ఇవ్వాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాళ్ళు పట్టుకున్నా కనికరించలేదు. ఆత్మాభిమానం దెబ్బతిన్న ఆదిమూలం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. దీంతో శ్రేణుల ద్వారా ఆయన దిష్టిబొమ్మలు తగులబెట్టించారు. టీడీపీ టికెట్‌తో ఇపుడు సత్యవేడు నుంచే ఆయన బరిలో దిగుతున్నారు.



సత్యవేడు టికెట్‌కోసం పెద్దిరెడ్డి కాళ్లు మొక్కుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

గెలిచినా టికెట్ దక్కని వరప్రసాద్

వైసీపీలో పదేళ్ళ పాటు ప్రజాప్రతినిధిగా కొనసాగిన గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావుకు ఎమ్మెల్యే సీటు లేదని మొహం మీదే చెప్పేశారు. 2014లో తిరుపతి నుంచీ వైసీపీ ఎంపీగా గెలిచిన ఆయనకు 2019లో రెండోసారి ఎంపీగా అవకాశం ఇవ్వలేదు. గూడూరు అసెంబ్లీ స్థానం కేటాయించారు. అక్కడా గెలిచిన ఆయనకు ఇప్పుడు టికెట్ లేదన్నారు. దీంతో ఆయన బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీకి సిద్ధమవుతున్నారు.

గురుమూర్తితో బంతాట

అగ్రవర్ణ నాయకులతో అణిగిమణిగి వినయంగా వ్యవహరించే తిరుపతి ఎంపీ గురుమూర్తితోనూ బంతాట ఆడుకున్నారు. ఆయనకు సత్యవేడు కేటాయించారు. ఇష్టం లేకపోయినా సిద్ధపడి ప్రచారంలో దిగిన కొద్ది రోజులకే మళ్లీ తిరుపతి ఎంపీ టికెట్ కేటాయించారు.

జడ్పీటీసీ కుర్చీపై మూత్రం పోసిన వైసీపీ నేత



చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నేత మూత్రం పోసిన తన కుర్చీని పరిశీలిస్తున్న జడ్పీటీసీ మన్నెం శీనయ్య

చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ మన్నెం శీనయ్యకు కేటాయించిన ఛాంబర్‌లో ఆయన కుర్చీపై అధికార పార్టీ నేత ఒకరు మూత్రం పోసిన ఘటన దళిత వర్గాలను కలచివేసింది. గతేడాది ఫిబ్రవరి 13న జడ్పీటీసీ మన్నెం శీనయ్య తన ఛాంబర్‌లోకి వెళ్ళగా కుర్చీపై ఎవరో మూత్రం పోసినట్టు గుర్తించారు. కార్యాలయ సిబ్బందిని ఆరా తీయగా అంతకు మునుపు వైసీపీ నేత ఒకరు గది తాళాలు తీసుకుని తెరిచినట్టు గుర్తించారు. ఆ నేతదీ, జడ్పీటీసీదీ ఒకే గ్రామం. ఇరువురికీ నడుమ విభేదాలున్నాయి. దీంతో తన గ్రామానికే చెందిన వైసీపీ నేత ప్రవీణ్‌కుమార్ రెడ్డి తన కుర్చీపై మూత్రం పోశారంటూ జడ్పీటీసీ అదే రోజు తిరుపతికి వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. మరుసటి రోజు చిల్లకూరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతం జిల్లావ్యాప్తంగా దళిత వర్గాలను తీవ్రంగా గాయపరిచింది.

మీ బిడ్డలైతే ఇక్కడ చదువుతారా జగన్?

చదువుల గురించి జగన్ చెప్పుకునే గొప్పల అసలు రంగు సంక్షేమ హాస్టళ్ళ నిర్వహణను పరిశీలిస్తే అర్థం అవుతుంది. దళిత బిడ్డలు చదువుకునే తావుల్లో కనీస వసతులు లేవు. నిర్లక్ష్యానికి సాక్ష్యంగా ఇవి దర్శనమిస్తున్నాయి.


● చిల్లకూరు మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ పేరిట వున్న గురుకుల వసతి గృహంలోని గదులు అధ్వానంగా వున్నాయి. విద్యార్థులకు ఉపయోగపడాల్సిన గదుల్లో చెత్తా చెదారం, పనికి రాని వస్తువులను నింపి డంపింగ్ యార్డులా తయారు చేశారు. తాగునీటి కొళాయి ఉన్న చోట పాచిపట్టిపోయి తీవ్ర అపరిశుభ్రత నెలకొనివుంది.



● తొట్టంబేడు మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పునాదులు దెబ్బతిన్న వైనం భవనం వెలుపలి వైపే కళ్ళకు కడుతోంది.



● బీఎన్ కండ్రిగ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో తలుపులు, కిటికీలు అధ్వానంగా వున్నాయి. అన్నీ సగం విరిగిపోయి కనిపిస్తున్నాయి.



కురింజలంలో పేదలభూమి స్వాహా

వరదయ్యపాలెం మండలం కురింజలం పంచాయతీ దరఖాస్తు సంతోషపురం కాలనీ పక్కన 3 ఎకరాల ప్రభుత్వ భూమి వుంది. తలారివెట్టు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, భాస్కరయ్య, ఎన్టీయార్ నగర్‌కు చెందిన చెంగయ్య, సుబ్రమణ్యం అనే నలుగురు దళితులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలంటూ అధికారులు ఈ భూములను 2002లో స్వాధీనం చేసుకున్నారు. చివరికి ఆ ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకుడొకరి కుటుంబీకుల పేరిట ఆ భూమి నమోదైంది. బాధిత దళితులు న్యాయం చేయండని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.



వైసీపీ నేతలు కాజేసిన భూమిలో బాధిత దళితులు

పథకాలన్నీ అటకెక్కించేశారు

దళితుల సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలు, కార్యక్రమాలన్నీ గత ఐదేళ్లుగా దాదాపుగా ఆగిపోయాయి. ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైంది. గతంలో ఏటా జిల్లా వ్యాప్తంగా వేల మంది దళితులకు స్వయం ఉపాధి కోసం రుణ సాయం అందేది. భూమి కొనుగోలు పథకం కూడా అమల్లో వుండేది. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా పథకం ద్వారా ప్రతిభావంతులైన దళిత విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం వుండేది. పేద ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకునేలా బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం వుండేది. గత టీడీపీ ప్రభుత్వం వీటిని సమర్థవంతంగా అమలు చేసింది. జగన్ అధికారంలోకి వచ్చాక ఈ పథకాలలో ఒక్కటి కూడా అమలు కావడం లేదు.

కడగుంటలో చేపలు పట్టనివ్వలేదు

బాలాయపల్లి మండలం కడగుంటలో వప్పతొట్టి మస్తానయ్య అనే దళితుడు 2022లో గ్రామ చెరువును రూ.4.20 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అందులో చేపలు పెంచారు.అయితే చేపలు పట్టుకోనివ్వకుండా అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు అడ్డుకున్నారు.

వాక్యంలో భూములు లాక్కున్నారు

వైసీపీలో దళితులకు ఒక న్యాయం. ఇతరులకు మరొక న్యాయం అనేందుకు నిదర్శనం బాలాయపల్లి మండలం వాక్యం గ్రామంలోని ఉదంతం. ఇక్కడ 15 ఎకరాల భూమి 2009 నుంచీ దళితుల అధీనంలో ఉంది. అప్పటి వైఎస్ ప్రభుత్వం దళితులకు పట్టాలు ఇవ్వాలని ప్రతిపాదించింది.ఎందుకో పెండింగ్‌లో ఉండిపోయింది.2022లో ఆ భూముల్లో దళితులు నిమ్మమొక్కలు నాటుకోగానే వైసీపీ నేతలు ఆగ్రహించారు. అధికారుల ద్వారా నాటిన మొక్కలు పీకించేసి, ప్రభుత్వ భూములని బోర్డు పెట్టించారు. ఏడాది గడిచేసరికి అదే భూములను వైసీపీ నేతలకు పట్టాలు ఇచ్చేశారు. ఇప్పుడు వారు ఎంచక్కా నిమ్మ మొక్కలు నాటుకున్నారు. దళితుల వేదన అరణ్య రోదనే అయింది.

నామినేషన్ ఉపసంహరణ

సూళ్ళూరుపేట మండలం ఆబాక పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికలపుడు మండల టీడీపీ నేత పాకం వెంకటసుబ్బయ్య కోడలు ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేశారు. అయితే అధికార పార్టీకి చెందిన అగ్రవర్ణ నేతల ఒత్తిడితో వెంకటసుబ్బయ్యను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని వేధించారన్న ఆరోపణలు వచ్చాయి. గత్యంతరం లేక నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి

వరదయ్యపాళెం, ఏప్రిల్ 13:వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ నక్కలమిట్టకు చెందిన షికారీ మణికంఠ(38) వడదెబ్బతో మృతి చెందారు. శుక్రవారం పనుల నిమిత్తం బయటకు వెళ్లిన ఆయన వడదెబ్బకు గురై శ్రీకాళహస్తి ఆస్పత్రిలో చేరాడు.శనివారం మధ్యాహ్నం ఆస్పత్రిలోనే మృతి చెందాడు.9నెలల గర్భిణి అయిన భార్య , ఇద్దరు పిల్లలు మణికంఠ మృతితో అనాథలయ్యారు.

ఏకతాటిపైకి కూటమి పార్టీల నేతలు

పవన్ పర్యటనతో మారిన రాజకీయ పరిణామాలు

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఊపిరిసలపనంత బిజీ షెడ్యూల్...మరోవైపు జ్వరంతో వచ్చిన నీరసం...అవన్నీ పక్కనపెట్టి కూటమి నేతలను ఏకతాటిపైకి తెచ్చేందుకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక విమానంలో తిరుపతికి వచ్చారు.రెండు రోజుల పాటు గ్రాండ్ రిడ్జి హోటల్లో మకాం చేసి అసమ్మతులను చల్లార్చారు.పొత్తుల్లో సీట్లు కోల్పోయిన కూటమికి చెందిన సీనియర్ నాయకుల త్యాగాల గురించి ప్రస్తావించారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబు,తాను చేస్తున్న పోరాటాలను వివరించారు. కష్టపడండి...మీ శ్రమ వృథా కానివ్వబోమని హామీ ఇచ్చారు.పవన్ నచ్చజెప్పిన తీరుతో కూటమినేతల్లో అసంతృప్తులు పటాపంచలయ్యాయి.ఒక్కో పార్టీ నాయకులతో దాదాపు గంటపాటు మాట్లాడిన తీరుకు నేతలంతా ఫిదా అయ్యారు. ఆదివారం నుంచి ప్రచారాన్ని ముమ్మరం చేస్తామని అసమ్మతి నేతలు చెప్పడంతో కథ సుఖాంతమైంది.టీడీపీ ఇంచార్జి సుగుణమ్మ నేతృత్వంలో ఆదివారం 34వ డివిజన్లో ప్రచారం జరగనుంది. అదేవిధంగా జనసేన ఇంచార్జి కిరణ్ రాయల్ పార్టీ కార్యకర్తలతో సోమవారం రామతులసీ కల్యాణమండపంలో సమావేశమై ప్రచారానికి కార్యోన్ముఖులు కానున్నారు.

తిరుపతిపైనే ఫోకస్ ఎందుకంటే?

2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ స్థాపించిన మెగాస్టార్ చిరంజీవిని పాలకొల్లు తిరస్కరిస్తే... తిరుపతి అక్కున చేర్చుకుంది.ఆ విధంగా తిరుపతి నియోజకవర్గం మెగా ఫ్యామిలీకి సెంటిమెంట్‌గా మారింది. ఈసారి ఎన్నికల్లో కూడా తిరుపతిలో పవన్ లేదా ఆయన సోదరుడు నాగబాబు పేరు వినిపించినా కుదర్లేదు. అయితే పొత్తుల్లో భాగంగా ఆ సీటు జనసేనకు దక్కడంతో తిరుపతి సీటుపై ఆశపెట్టుకున్న టీడీపీ నేతలు నైరాశ్యంలోకి వెళ్లారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు సీటు కేటాయించడంతో నిరాశ కాస్త వ్యతిరేకంగా మారింది.టీడీపీ నేతలే కాకుండా జనసేన ఇంచార్జి కిరణ్ రాయల్ కూడా అలకపాన్పు ఎక్కారు.ఇలా అందరూ ఆరణికి వ్యతిరేకంగా మారడంతో వారిమధ్య సయోధ్య కుదిర్చేందుకు పవన్ రెండు రోజులపాటు తిరుపతిలో మకాం వేశారు. తిరుపతి సీటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అసంతృప్తి చల్లార్చే ప్రయత్నాలు చేశారు. శుక్రవారం రాత్రి ఒంటిగంట వరకు టీడీపీ, జనసేన నాయకులతో భేటీ అయ్యారు.ఆరణి శ్రీనివాసులు విజయం కోసం అందరూ కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి సుగుణమ్మ, జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. అప్పటివరకు అసంతృప్తులుగా వున్న వారి స్వరం మారింది. కూటమి అభ్యర్థి విజయం కోసం కలిసిపనిచేస్తామని స్పష్టం చేశారు.

టీడీపీ పాలనలోనే అభివృద్ధి: పాశం



రోడ్‌షోలో మాట్లాడుతున్న డాక్టర్ పాశం సునీల్‌కుమార్

కోట, ఏప్రిల్ 13: టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి చేశామని, మరోసారి తమను ఆశీర్వదించాలంటూ గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ కోరారు. కోట మండల చెందోడు పంచాయతీ పరిధిలోని విద్యానగర్, చెందోడు, దళిత, బీసీ, నీలగిరి సంఘం గిరిజన కాలనీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన రోడ్డు షోలో సునీల్‌కుమార్, టీడీపీ నేతలకు మహిళలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్డు, వీధి లైట్లు, పాఠశాలలు కట్టించామన్నారు. రాక్షస పాలన అంతముందించి సైకో జగన్‌ను తరిమికొట్టాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని సునీల్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు వెంకటకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంయాదవ్, సాయికృష్ణారెడ్డి, చల్లా శ్రీనివాసులు, మస్తాన్‌బాషా, తీగల సురేష్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, పోలయ్య పాల్గొన్నారు.

సైకో పాలనకు స్వస్తి చెప్పండి: పాశం

గూడూరు, ఏప్రిల్ 13: రానున్న ఎన్నికల్లో ప్రజలు సైకోపాలనకు స్వస్తి చెప్పి చంద్రన్న పాలనకు స్వాగతం పలకాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఒక్క చాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలన వల్ల అభివృద్ధిలో రాష్ట్రం ఎంతో వెనుకబడి పోయిందన్నారు. అందరం కలసికట్టుగా సైనికుల్లా పనిచేసి టీడీపీని గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్ రహీమ్, బిల్లు చెంచురామయ్య, చాన్‌బాషా, జనార్దన రెడ్డి, మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రాక్షసుడిని కూలగొట్టేందుకే కూటమి: కురుగొండ్ల



మేల్చూరులో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, ఏప్రిల్ 13: రాక్షసుడిని కూలగొట్టేందుకే కూటమి ఏర్పడడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని పెరిమిడి పంచాయతీలోని సీసీ కండ్రిగ, బొల్లవారి పాళెం, మేల్చూరు, పెరిమిడి గ్రామాలలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, ఎంపీగా వెలగపల్లి వరప్రసాదరావును లను గెలిపించాలని కోరారు. బీజేపీ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర నిధులు ఇచ్చినా ముఖ్యమంత్రి జగన్‌రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు అత్తివరం రామ్మూర్తి రెడ్డి, ఒప్పాల సీతారామ్, ఇంటూరు కృష్ణమనాయుడు, పెరిమిడి వెంకటేష్ రెడ్డి, పెరిమిడి తిరుపాల్ రెడ్డి, గాలి ఉదయ్, పరమాల బుచ్చయ్యతో పాటు ఇరవై కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచు వనమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు, కూను శ్రీహరి, నల్లబోతుల మురళి, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, సీసీ నాయుడు, కొర్రపాటి రామచంద్రనాయుడు, వయ్యావూరు పెంచలయ్య, యాల్ల శ్రీనివాసులు, బాలకృష్ణా రెడ్డి, షేక్ రంగబాబు, చంద్రనాయుడు, బాలరాజు, సతీష్, బద్వేలు కళ్యాణ్ రెడ్డి, శేఖర్ నాయుడు, దాసరి కోటేశ్వరావు, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవ మూర్తులకు శోభాయాత్ర



నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 13: పట్టణంలోని బజారువీధిలో వెలసిన రామమందిరానికి అగ్రహారపేటకు చెందిన చాగణం సుమన్, రేష్మా నాయుడు దంపతులు రూ.2 లక్షల విలువచేసే సీతమ్మ సమేత రామలక్ష్మణ ఆంజనేయ ఉత్సవమూర్తుల విగ్రహాలను అందజేశారు. శనివారం ఆ విగ్రహాలకు మంగళ వాయిద్యాలు, మంత్రోచ్ఛరణల నడుమ పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం రామమందిరం వద్ద ఉభయదాతలు ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆలయ ఈవో శశ్యాంక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామిరెడ్డి రాజారెడ్డి, గాదిరెడ్డి గోపి, బిరదవాడ శ్రీనివాసులు, గంధవల్లి సిద్దయ్య, అత్తికాయల సుబ్రహ్మణ్యం, భాస్కర్, వెంకటేశ్వర్లు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 155 మంది ఎంపిక

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 13: నాయుడుపేట పట్టణంలోని విశ్వం కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 300మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి 155మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శాంతాలక్ష్మి, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాలో వైఎస్ షర్మిల పర్యటన

శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరుల్లో బహిరంగసభలు

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేడు జిల్లాలో పర్యటించనున్నారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికల బహిరంగసభల్లో పాల్గొననున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం షర్మిల ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాళహస్తి చేరుకుంటారు. తొలుత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం అక్కడ నుంచీ ర్యాలీగా బేరివారి మండపం చేరుకుంటారు. అక్కడ జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచీ బయల్దేరి సత్యవేడు చేరుకుని సాయంత్రం 4 గంటలకు అక్కడి గాంధీ విగ్రహ కూడలిలో నిర్వహించే బహిరంగసభకు హాజరవుతారు. అటు తర్వాత రాత్రి 7.30గంటలకు నగరి నియోజకవర్గం పుత్తూరు చేరుకుని బహిరంగసభలో పాల్గొంటారు. కాగా మరుసటి రోజైన 15వ తేదీ సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని జీడీనెల్లూరు,పలమనేరు, పూతలపట్టుల్లో పర్యటించనున్నారు. 16వతేదీ మంగళవారం పీలేరు, మదనపల్లె, తంబళ్ళపల్లెలో పర్యటించి బహిరంగ సభల్లో పాల్గొంటారు.

మే 15 నుంచి ఇంటర్ దరఖాస్తుల జారీ

22 నుంచి జూలై ఒకటి వరకు రెండు దశల్లో ప్రవేశాలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 13: 2024-25 సంవత్సరానికి సంబంధించి జూనియర్ ఇంటర్‌లో ప్రవేశ ప్రక్రియ మే 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తిరుపతి ప్రాంతీయ విద్యామండలి పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) జీవీ ప్రభాకర్ రెడ్డి చెప్పారు. మొదటి విడతగా మే 15 నుంచి దరఖాస్తులు విక్రయించనున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను తక్షణం సమర్పించిన వారికి అదే నెల 22 నుంచే ప్రవేశాలు ప్రారంభించనున్నారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ జూన్ 1వ తేదీ కాగా, అదే రోజునుంచి ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. జూన్ 10 నుంచి జూలై ఒకటో తేదీ వరకు రెండో దశ అడ్మిషన్లు జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు మాత్రమే ప్రవేశాలు నిర్వహించాలని ఆర్ఐవో ఆదేశించారు.

వివాహితపై కర్రతో దాడి

వాకాడు, ఏప్రిల్ 13: మండలంలోని వాలమేడు గ్రామానికి చెందిన వివాహితపై కర్రతో దాడిచేసి అసభ్యకరంగా దుర్భాషలాడిన బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన వ్యక్తి తూపిలి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... తూర్పుగోదావరి జిల్లా తుని గ్రామానికి చెందిన బాధితురాలికి వాలమేడులోని ఈదూరు మస్తానయ్యతో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా వాలిమేడులోని రొయ్యల హేచరీలో వంట చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. 11వ తేదీ మధ్యాహ్నం ఇంటికి వెళ్తుండగా బాలిరెడ్డిపాళానికి చెందిన వెంకటేశ్వర్లు కర్రతో దాడిచేసి దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 13: నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో లారీ ఢీకొని వృద్ధుడు మీరయ్య(65) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని అగ్రహారపేటకు చెందిన మీరయ్య రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ మీరయ్యను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అ'పర్మిట్' రాకపోకలు

- రవాణాశాఖ చెక్‌పోస్టు మూసివేతతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- రోజువారీ పర్మిట్ లేకుండానే వచ్చివెళ్తున్న పక్క రాష్ట్ర వాహనాలు



మూసివేసిన చెక్‌పోస్టు

తడ, ఏప్రిల్ 13: తడ మండలంలోని భీములవారిపాళెం వద్ద ఉన్న రవాణాశాఖ చెక్‌పోస్టు మూసివేతతో పర్మిట్ లేకుండానే ఇతర రాష్ట్రాల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అక్రమ సరుకు రవాణాను అడ్డుకునేందుకు, రాష్ట్రాల మధ్య తిరిగే వాహనాలకు పర్మిట్లు మంజూరు చేసేందుకు దశాబ్దాల క్రితం చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అయితే చెక్‌పోస్టులు అవినీతికి నిలయాలుగా మారిపోయాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం 2017లో జీఎస్టీని అమల్లోకి తెచ్చి చెక్‌పోస్టులను ఎత్తివేసింది. ఫలితంగా వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో నడిచే చెక్‌పోస్టులన్నీ దేశవ్యాప్తంగా మూతపడ్డాయి. ఆ తరువాత రవాణాశాఖ ఆధ్వర్యంలో నడిచే చెక్‌పోస్టులను ఎత్తివేయాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆ ప్రకారం కొద్ది రోజుల క్రితం తడ మండలంలోని భీములవారిపాళెం వద్ద ఉన్న రవాణాశాఖ చెక్‌పోస్టులను మూసివేశారు. అవసరమైన సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో అక్రమ వసూళ్లకు చెక్‌పడింది. వాహనాలు చెక్‌పోస్టు వద్ద ఆగకుండా నేరుగా వెళ్లిపోతున్నాయి. అయితే కొంతమంది వాహనదారులకు ఇది వరమవుతోంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు మన రాష్ట్రంలో ప్రయాణించాలంటే తప్పనిసరిగా మన రాష్ట్ర పర్మిట్ ఉండాలి. ఎనిమిది సీట్ల కారు నుంచి బస్సులు, ట్రైలర్ లారీలు వంటి అన్ని రకాల వాహనాలు పర్మిట్లతోనే రాష్ట్రంలో అడుగుపెట్టాలి. అలా వారంరోజులు పర్మిట్ పొందిన వాహనం రాష్ట్రంలో ఒక ట్రిప్పు రాకపోకలకు అనుమతి ఉంటుంది. అందుకుగాను ఎనిమిది సీట్ల కారుకు రూ.2650, ట్రక్కు, ఆటో వంటి వాటికి రూ.300, మినీలారీ నుంచి లారీ వరకు రూ.900 నుంచి రూ.1600 వరకు, ట్రైలర్ వంటి భారీ వాహనాల నుంచి రూ.3,600 నుంచి రూ.4,000 వరకు పర్మిట్ల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. పరిశ్రమలు తమ ఉద్యోగులను తరలించే బస్సు యజమానులు రెగ్యులర్ పర్మిట్ బస్సులు కాకుండా ఆ స్థానంలో స్పేర్ బస్సులను తిప్పాల్సివస్తే బస్సులోని ఒక్కొక్క సీటుకు రూ.900 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అయితే చెక్‌పోస్టు ఎత్తివేయడంతో వాహనదారులకు కలిసివస్తోంది. భీములవారిపాళెం చెక్‌పోస్టు నుంచి శ్రీసిటీ సెజ్‌కు కేవలం రెండు కిలోమీటర్లు కాగా, మాంబట్టు సెజ్ పది కిలోమీటర్ల దూరంలో ఉండటంతో కొన్ని వాహనాలు ఎటువంటి పర్మిట్లు లేకుండానే ఆయా సెజ్‌ల వరకు ప్రయాణించి వెళ్తున్నాయి. ఇలా తమిళనాడు నుంచి రోజుకు సరాసరిన 450నుంచి 500 వాహనాలు వచ్చి వెళ్తున్నట్లుగా ప్రాథమిక అంచనా. రోజుకు సరాసరిన 3 నుంచి 4 లక్షల రూపాయల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. చెక్‌పోస్టు ఎత్తివేయడం, తనిఖీలు లేకపోవడంతో కొన్ని వాహనాలు పర్మిట్ లేకుండా వచ్చి వెళ్లిపోతుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. దీనికి అడ్డుకట్టవేయకపోతే త్రైమాసిక పన్నులు చెల్లించి తిరిగే బస్సులు సైతం ఇదేదారి పట్టే ఆస్కారం ఉంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఇటువంటి అక్రమాలకు చెక్‌పెట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బీజేపీతోనే దేశాభివృద్ధి: వరప్రసాద్



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(ఉపాధ్యాయ నగర్), ఏప్రిల్ 13: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన తిరుపతి నగరంలోని మున్సిపల్ పార్కుకు వెళ్లి అక్కడ వాకింగ్ చేస్తున్న యువకులతో మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. అక్కడ నుంచి టీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్దకెళ్లి స్థానికులతో మాట్లాడారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం కేటీ రోడ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులతో కలిసి వరప్రసాదరావు రోడ్ షో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యుగంధర్, దామోదర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుపతిలోని టెంపుల్ టౌన్ కాలనీలో ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు సతీమణి కొల్లూరి లక్ష్మి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె కాలనీవాసులతో మాట్లాడుతూ వరప్రసాదరావు తిరుపతి ఎంపీగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని అన్నారు. అటువంటి వ్యక్తికి వైసీపీలో ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని, సహించలేక ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారని చెప్పారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. కమలం గుర్తుపై ఓటేసి ఎంపీగా వరప్రసాదరావును, గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



టెంపుల్‌టౌన్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కొల్లూరి లక్ష్మి

జగన్ మూర్ఖపు చర్యలతో ఇంటర్ విద్య పతనం: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఏప్రిల్ 13: ముఖ్యమంత్రి జగన్ మూర్ఖపు చర్యల వల్ల రాష్ట్రంలో ఇంటర్ విద్య పతనమైందని, శుక్రవారం విడుదలైన ఫలితాల్లో దిగజారిన ఉత్తీర్ణత శాతమే ఇందుకు నిదర్శనమని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ధ్వజమెత్తారు. శనివారం మండలంలోని నందిమాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత విధానాలతో హైస్కూల్ ప్లస్ పేరుతో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టిందని, అయితే ఆ స్థాయిలో బోధించగలిగే అధ్యాపకులను నియమించకపోవడం, ఉన్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వకపోవడంతో విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసిందన్నారు. ఇంగ్లీషు మీడియాన్ని ఎవ్వరూ వ్యతిరేకించలేదని, అనంతరం నందిమాలతో పాటు ఎర్రగుంట, చెన్నప్పనాయుడుపేట, పత్తిపాడువడ్డిపాలెం గ్రామాలలో సూళ్లూరుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ సైకిల్‌కు ఓటేసి తనను, కమలంపై ఓటు వేసి ఎంపీగా వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు రమేష్‌నాయుడు, మధుసూదన్ నాయుడు, శివకుమార్, శేఖర్‌నాయుడు, ప్రసాద్ నాయుడు, సుబ్బరామయ్య, హరినాయుడు, చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, నెలవల రాజేష్, మల్లు కృష్ణయ్య, రామకృష్ణా, యుగంధర్, సుబ్రహ్మణ్యం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దోచుకోవడం.. దాచుకోవడమే జగన్ లక్ష్యం: పరసారత్నం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 13: దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగించారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని కోళ్లమిట్టలో టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరసా వెంకటరత్నం మాట్లాడుతూ ఒక చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ దోచుకోవడం తప్ప అభివృద్ధి ఏమి చేయలేదన్నారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం ఎంతో అవసరమని, ప్రజలు ఆలోచించి ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతనిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, చింతల సతీష్ చంద్ర, బొమ్మన్ ఏకాంబరం, మాధవనాయుడు, నాపా మునిరాజా, నెలబోయిన రాసులోచనమ్మ, మేడా సాయి నారాయణ, బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, నూతలపాటి శ్రీనివాసులు, తన్నీరు సుజన్‌రావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవానికి లోటు రానివ్వం: లక్ష్మీసాయిప్రియ



టీడీపీలో చేరిన వారితో లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 13: బీసీల ఆత్మగౌరవానికి ఎలాంటి లోటు రాకుండా చూస్తామని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. శనివారం వెంకటగిరి మండలం కలపాడు గ్రామంలో జయహో బీసీ సదస్సు జరిగింది. వైసీపీకి చెందిన ఎంపీటీసీ గోగుల వెంకటరమణమ్మతో పాటు 50 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. వరందరికీ లక్ష్మీసాయిప్రియ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీల కోసమంటూ సీఎం జగన్ ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క పైసా కూడా నిధులు ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. సైకో జగన్ ను గద్దె దింపేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను పూర్తిగా అణగతొక్కేశారని అన్నారు. బీసీల అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బాటలు వేయగా, ఆయన ఆశయాలను చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని చెప్పారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపిస్తే బీసీల బీసీల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పుకొచ్చారు. కాగా, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తన కుమార్తెను గెలిపించాలంటూ పట్టణంలోని 6వ వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరావు, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, కాపా శ్రీనివాసులు నాయుడు, పునుగోటి విశ్వనాధనాయుడు, వల్లభనేని మధునాయుడు, నర్సిహులు, రామకృష్ణ, తోట రామచంద్రయ్య, మల్లారం బాబు, గోకుల శంకరయ్య, అంజీ, అషోక్, గొర్ల పెంచలయ్య, మనోహర్, గరిటి చెంచయ్య యాదవ్, బాబు నాయుడు, మగ్గం వెంకటాచలం, నక్కల వెంకటేశ్వర్లు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు నాని, చంటి, హేమంత్ చౌదరి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


విజయశ్రీని గెలిపించండి



కరపత్రాలు అందజేస్తున్న నెలవల రాజేష్, రఫీ

నాయుడుపేట, ఏప్రిల్ 13: పట్టణంలోని చంద్రబాబుకాలనీలో శనివారం సాయంత్రం టీడీపీ నాయకులు నెలవల రాజేష్, రఫీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలను తెలుపుతూ కరపత్రాలను అందజేసి డాక్టర్ నెలవల విజయశ్రీని గెలిపించాలని కోరారు. కాలనీ ముఖద్వారం వద్ద టీడీపీ నాయకులకు కాలనీవాసులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ మాట్లాడుతూ పట్టణంలో ఏ గడపకు వెళ్లినా టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పసల చెంగయ్య, ముత్యాలయ్య, చెంగయ్య, కర్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోండి



ఓటు హక్కు అవగాహన ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

నాయుడుపేట, ఏప్రిల్ 13: మంచి పాలకులను ఎంచుకునేందుకు రాజ్యాంగం మనకు ఓటు హక్కు కల్పించిందని పంచాయతీ కార్యదర్శి వెంకటరావు అన్నారు. నాయుడుపేట విన్నమాలలో శనివారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ పరమశివం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మణెమ్మ, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో శనివారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఎంపీడీవో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్, వీఆర్వో గౌసిని ఆధ్వర్యంలో ఓటు వజ్రాయుధం అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.


కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 13: దేశంలో కానీ, రాష్ట్రంలోని కానీ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అర్హులందరికీ పెన్షన్‌లు అందజేయడంతో పాటు రైతులకు రుణమాఫీ, రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించడం వంటి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గూడూరు ఎమ్మెల్యేగా చిల్లకూరు వేమయ్య, సర్వేపల్లి ఎమ్మెల్యేగా పూల చంద్రశేఖర్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, వేమయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా సంగమేశ్వరుడి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కోట, ఏప్రిల్ 13: కోట మండలం గూడలిలో గల సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఆశేష భక్తజన సందోహం మధ్య కామాక్షీదేవి, సంగమేశ్వరుడి కల్యాణాన్ని వేదపండితులు జరిపించారు. అనంతరం సంగమేశ్వరుడు, కామాక్షీదేవి ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, ఏప్రిల్ 13: కోట క్రాస్‌రోడ్డులో శనివారం 54 మద్యం బాటిళ్లను ఎస్ఐ నాగబాబు స్వాధీనం చేసుకున్నారు. చిల్లకూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన కేశవులు బైక్‌పై 54 మద్యం బాటిళ్లను తీసుకువెళ్తుండగా గురించి అదుపులో తీసుకున్నారు. మోటారు బైక్, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలాయపల్లి: మండలంలోని నాయుడు చెరువు కండ్రిగ గ్రామానికి చెందిన మురళీకృష్ణ జయంపు నుంచి పది మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహబూబ్ సుబాని తెలిపారు.

మద్యం నిల్వలపై ప్రత్యేక నిఘా

వాకాడు, ఏప్రిల్ 13: ఎన్నికల నేపథ్యంలో మద్యం నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్ఈబీ సీఐ దేవర శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి 44 కేసుల మద్యాన్ని పట్టుకున్నామన్నారు. ఎక్కడైనా అక్రమంగా మద్యాన్ని నిల్వచేసినట్లు తెలిస్తే 9440902514 నంబరుకు సమాచారం అందించాలని కోరారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతంగా మండల సమావేశం

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 13: వెంకటగిరి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తనూజ, ఎంపీడీవో నీలకంఠారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రశాంతంగా జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని రావాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఏప్రిల్ 13: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసివున్న లక్ష్మీనరసింహస్వామికి శనివారం ఉదయం అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ జరిపారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నదానం

గూడూరు అర్బన్, ఏప్రిల్ 13: స్థానిక సాయిరాం వృద్ధాశ్రమంలో శనివారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్, రాము, కళ్యాణి, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గమళ్లపాళెంలోని నిరాశ్రయుల కేంద్రంలో వెంకటేశ్వరరావు, సునీత దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మయూరి శ్యామ్‌యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామావతారంలో బాలాంజనేయస్వామి



సూళ్లూరుపేట, ఏప్రిల్ 13: సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి వసంతోత్సవాల్లో భాగంగా శనివారం బాలాంజనేయస్వామి రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొన్నారు. అదేవిధంగా బ్రాహ్మణ వీధిలోని సీతారాముల ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీరాముడు పరశురాముడు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మల్లికార్జున శర్మ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.